ప్రజాశక్తి

ఆదివారం 21 జులై 2024

8 పేజీలు





విశాఖపట్నం అనకాపల్లి

ప్రభుత్వ భూమికి రెవెన్యూ ఎసరు

- ఒకరికి అసైన్, మరొకరి పేర వెబ్‌ల్యాండ్‌లో నమోదు
- దేశపాత్రునిపాలెంలో ఇలాంటి మతలబులెన్నో...
- సర్వే చేస్తే వెలుగులోకి మరిన్ని విషయాలు



దేశపాత్రునిపాలెంలో చేతులు మారిన డి పట్టా భూమి ఇదే..

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, పరవాడ విలేకరి

జిల్లాలోని పరవాడ మండలం దేశపాత్రునిపాలెం రెవెన్యూలోని ప్రభుత్వ భూముల్లో అనేక మతలబులు చోటుచేసుకున్నాయి. కంచే చేనుమేసినట్లు, ప్రభుత్వ భూములు రక్షించాల్సిన రెవెన్యూ సిబ్బందే ఆక్రమణదారుల కొమ్ము కాయడం గమనార్హం. కోట్ల విలువైన ప్రభుత్వ భూములు తమ కళ్లముందే ప్రయివేటు వ్యక్తులపరమవుతుంటే.. కొంతమంది రెవెన్యూ అధికారులు కళ్లుమూసుకొని కాసులు చేసుకుంటున్నారు. రెవెన్యూ సిబ్బంది బాధ్యతారాహిత్యాన్ని ఆసరాచేసుకొని డి పట్టాలు ఇవ్వకపోయినా.. ఇచ్చినట్లు తమ పేర వెబ్‌ల్యాండ్, 1బి రికార్డులో పేర్లు నమోదుచేసుకున్న వారు కొందరైతే, అసైన్ చేసిన వారి పేరు కాకుండా ఇంకొకరి పేర వెబ్‌ల్యాండ్‌లో పేర్లు నమోదు చేసుకున్నట్లు రికార్డుల్లో బయట పడుతుండటం విస్మయం గొలుపుతోంది. భూమి విలువ పెరగడంతో భూ బకాసురుల కళ్లన్నీ ఇక్కడి ప్రభుత్వ భూములపై పడ్డాయి. దేశపాత్రునిపాలెంలో వివిధ సర్వే నెంబర్లలో 15 మందికి కొన్ని సంవత్సరాల క్రితం ప్రభుత్వం కనీసంగా 1.16 ఎకరాల నుంచి గరిష్టంగా 4.84 ఎకరాల వరకు ప్రభుత్వ డి పట్టా మంజూరు చేసింది. ఆ భూములపై హక్కు కలిగిన వారంతా ఉపాధి కోసం వేర్వేరు ప్రాంతాలకు వెళ్లిపోవడం, కొంతమంది చనిపోవడంతో ఆ భూములపై కొంతమంది కన్ను పడింది. అటువంటివారు రెవెన్యూ అధికారుల సహాయంతో వెబ్‌ల్యాండ్, 1బిలో తమ పేర నమోదు చేసుకున్నారు. స్వాతంత్య్ర సమరయోధులు కాకపోయినా.. స్వాతంత్య్ర సమరయోధులుగా నమోదు చేయించారు. ఇలా అసైన్‌దారులు ఒకరైతే వేరొకరి పేర నమోదు చేసుకున్న భూమి 51.39 ఎకరాల వరకు వుంటుందని అంచనా. దీని విలువ రూ.246.67 కోట్లు ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

దేశపాత్రునిపాలెం సర్వే నెంబర్ 70/8లో బి.జక్కయ్యకు 3.67 ఎకరాలు, కె.కామేశంకు 70/9లో 3 ఎకరాలు, 74/1లో 1.80 ఎకరాలు, 299/1ఎలో కె.లీల (భర్త జీవనరత్నం)కు 4.64 ఎకరాలు, 70/3లో ఎపిఎం బాండేయికి 3.66 ఎకరాలు, 70/5లో కెఆర్‌సి.రావుకు 3.62 ఎకరాలు, 326/3లో చెన్నా రామస్వామికి 4.83 ఎకరాలు, 75/1ఎంలో డెక్కల నరసింహంకు 4.84 ఎకరాలు, 207/3లో ఎస్.ఉషాభాయికి 2.35 ఎకరాలు, 69/1ఎలో ఉప్పల సుందరమ్మకు 3.17 ఎకరాలు, 70/2లో ఎస్‌జెకె.ప్రసాదరావుకు మిగతా 2లో..



గిరి ప్రదక్షిణ చేస్తున్న వేలాది మంది భక్తులు



గిరి ప్రదక్షిణ రథాన్ని ప్రారంభిస్తున్న అశోక్

వైభవంగా గిరి ప్రదక్షిణ

- భారీగా తరలొచ్చిన భక్తులు
- అధికార యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు
- స్వచ్ఛంద సంస్థల సేవలు భేష్

వార్తలు 4 లో..

నిండుతున్న జలాశయాలు

వార్త 2లో..

'ఉక్కు' రక్షణకు కార్మికుల ఐక్యతే బలం

వార్త 2లో..

హుదూద్ ఇళ్లకు తాళాలు వేసిన రైతులు

వార్త 3లో..

జివిఎంసి కమిషనర్‌గా సంపత్ కుమార్



సంపత్ కుమార్



కల్పనా కుమారి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి కమిషనర్‌గా 2016 ఐఎఎస్ బ్యాచ్‌కి చెందిన పి.సంపత్ కుమార్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ శనివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. సంపత్ కుమార్ ప్రస్తుతం ఎన్‌టిఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా, అదనపు జిల్లా మెజిస్ట్రేట్‌గా విధులు నిర్వహిస్తూ విశాఖకు బదిలీ అయ్యారు. ప్రస్తుతం జివిఎంసి కమిషనర్‌గా విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

జిసిసి ఎమ్‌డిగా కల్పనా కుమారి

2019 ఐఎఎస్ బ్యాచ్‌కి చెందిన కల్పనా కుమారిని గిరిజన కో-ఆపరేటివ్ కార్పొరేషన్ లిమిటెడ్ (జిసిసి) మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ శనివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు జిసిసి ఎమ్‌డిగా పనిచేసిన సురేష్ కుమార్‌ను బదిలీ చేశారు. ఆయనను ఎక్కడకు వెళ్లనున్నారనేది ఇంకా స్పష్టత రాలేదు.

తప్పించుకు తిరుగువాడు జగదీశ్వరుడు..!

- ఎక్కడ అడుగు పెడితే అక్కడ మోసం
- ఎండాడ హయగ్రీవా 12.50 ఎకరాల కొండకు క్షవరం
- వృద్ధుల ఆశ్రమానికి ఎగనామం
- సిఐడికి ఆధారాలున్నా మీనమేషాలు



జగదీశ్వరుడు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

వయో వృద్ధులకు సేవ పేరుతో రూ.వందల కోట్ల విలువైన 12.50 ఎకరాలను పదేళ్ల క్రితం విశాఖలోని ఎండాడ కొండపై హయగ్రీవ ఇన్‌ఫ్రాటెక్ ప్రాజెక్ట్సు ప్రైవేట్ లిమిటెడ్ పేరున తీసుకున్న రియల్ ఎస్టేట్ వ్యాపారి చెరుకూరి జగదీశ్వరుడు నేటికీ తప్పించుకు తిరుగుతున్నారు. చాలా కాలం పాటు ఏ ఆశ్రమమూ అక్కడ నిర్మించకుండా ఆయన నిర్లక్ష్యం చేశారు. ఆయనపై రెండు తెలుగు రాష్ట్రాల్లో హైదరాబాద్, మంగళగిరి, విశాఖ భూ లావాదేవీల్లో మోసాలు, బ్యాంకులను ముంచేసిన వివాదాల్లో అన్నీ కలిపి సుమారు 30కి పైగా కేసులు నమోదై ఉన్నాయి. 'తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతీ'...అన్న మాదిరిగా బ్యాంకులను మోసం చేస్తూ రూ.కోట్లు రుణం పొందుతూ ప్రభుత్వాలు మారినప్పుడల్లా పాలకులను మేనేజ్ చేసుకుంటూ ఆయన వస్తున్నారు. తన ఆర్థిక నేరాలను కప్పిపుచ్చుకుంటూ ముందుకెళ్తున్నారు. ఆశ్రమం పేరుతో విలాసవంతమైన భవనాలకు ఆయన ప్లాన్ చేశారు. రూ.కోట్లను గుంజేశారు. ఎప్పటికీ నిర్మాణాలు జరగకపోవడంతో పలువురు నుంచి ఫిర్యాదులు 2021 నుంచి మొదలయ్యాయి. ప్రస్తుతం టిడిపి కూటమి ప్రభుత్వంలోనూ చక్రం తిప్పుతూ తనపై ఫిర్యాదులు చేసే కొంతమందిపై 'రివర్స్ కేసులు' పెట్టాలన్న తలంపుతో జగదీశ్వరుడు కదులుతున్నట్లు సమాచారం.

అసలేం జరిగింది ?

విశాఖ సిఐడి అధికారులు పెట్టిన కేసు నెంబరు 3/2013లో డాక్యుమెంటు నెంబరు 4864/2009 ఆస్తిని సిఐడి సీజ్ చేసింది. ఆ స్థలంలో సిఐడి హెచ్చరిక బోర్డులు పెట్టింది. అప్పటికే తనఖా పెట్టి బ్యాంకు నుంచి రూ.కోట్లు రుణాలను జగదీశ్వరుడు చేజిక్కించుకున్నారు. మంగళగిరిలో 10/22 నెంబరుతో సిఐడి ఆయనపై మరో కేసు నమోదు చేసింది. 2016లోనే మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ప్రభుత్వ భూమికి రెవెన్యూ ఎసరు

3.20 ఎకరాలు, 70/4లో ఐఎస్.ప్రసాదరావుకు 3.75 ఎకరాలు, 316/2లో కొట్ట చిన్నారావుకు 1.16 ఎకరాలు, 317/1లో టిపిపిజె.హనుమంతరావుకు 3.90 ఎకరాలు, 326/4లో ఎం.నర్సింగరావుకు 3.80 ఎకరాలు చొప్పున ప్రభుత్వం డి పట్టా ఇచ్చింది. అయితే రెవెన్యూ రికార్డుల్లో వీరిపేర్లు బదులు వేరొకరి పేర్లు నమోదు చేశారు.

రెవెన్యూ రికార్డులు తారుమారుచేసి గంట్ల మూలారావు కుటుంబ సభ్యుల పేరున ఎక్కువ భాగం భూమి నమోదు చేశారు. 4.80 ఎకరాలతో పాటు అసైన్‌కాని 74/2లో 3.50 ఎకరాలు మొత్తం 8.30 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాతంత్ర్య సమరయోధుని కోటాలో కె.కామేశంకు ఇచ్చినట్లు మాన్యువల్ 1బి రికార్డులో చూపించి, తిరిగి అతని దగ్గర గంట్ల మూలారావు, దొడ్డి ఆదిలక్ష్మి, గంట్ల జనకుమారి కొనుక్కొన్నట్లు నమోదు చేశారు. ఈ విషయం గంట్ల మూలారావు వద్ద 'ప్రజాశక్తి' ప్రస్తావించగా.. 'సర్వే నెంబరు 70/9, 74/1, 74/2లోని 8 ఎకరాలకుపైగా స్వాతంత్ర్య సమరయోధుడు కోటాలో కామేశంకు వచ్చింది. ఆ భూమి కామేశం కుమారుడు బలరామమూర్తి నుంచి నాకు లభించింది' అని తెలిపారు. భూముల టైటిల్‌కు సంబంధించి కోర్టులో కేసులు నడుస్తున్నాయని పేర్కొన్నారు.

తప్పించుకు తిరుగువాడు జగదీశ్వరుడు..!

జగదీశ్వరుడిపై విశాఖలో ల్యాండ్ పూలింగ్ కేసు స్వయంగా విఎంఆర్‌డిఎ నమోదు చేసింది. ఇలా 33 కేసులకుపైగా ఆయనపై నమోదై సిఐడి అధికారులకు సవాలుగా మారాయి. రాష్ట్రంలోని మంగళగిరిలో భూ లావాదేవీలపై 2022లో జగదీశ్వరుడిపై కేసు ఉంది. బ్యాంకు రుణాల ఎగవేతకు సంబంధించి ఆర్‌బిఐ, నకిలీ పత్రాలు, అలాగే ఫేక్ ఇన్‌పుట్ క్రెడిట్ ద్వారా మోసం చేస్తున్న జగదీశ్వరుడు సహా మరో 32 మంది అతని అనుచరులపై 2022లో లుక్ అవుట్ నోటీసులు జారీ అయ్యాయి. బ్యాంకు అధికారులతో పాటు దర్యాప్తు అధికారులను మోసగిస్తున్నాడని 2021లో ఎపి స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డిఫాల్టర్‌గా ఆయన్ని పేర్కొంది. సిఐడి ఈ కేసును ముందుకు సాగకుండా అకస్మాత్తుగా ఆపేసినట్లు స్పష్టమవుతోంది. కూటమి ప్రభుత్వంలోనూ జగదీశ్వరుడు చక్రం తిప్పుతున్నాడా ? అనే అనుమానాలు పలువురిలో కలుగుతున్నాయి.

కెజిహెచ్‌లో పిటియు సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అనవసరమైన గర్భ సంచి తొలగింపు శస్త్రచికిత్స (హిస్టెరెక్టమీ) సమస్యను ఎదుర్కోవడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, బేయర్ ఫార్మాస్యూటికల్స్ డివిజన్, ఫెడరేషన్ ఆఫ్ అబ్‌స్టెట్రిక్ అండ్ గైనకాలజికల్ సొసైటీస్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఒజిఎస్ఐ) భాగస్వామ్యంతో కెజిహెచ్‌లో ఏర్పాటు చేసిన ప్రిజర్వ్ ది యుటెరస్ (పిటియు) సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బేయర్స్ ఫార్మాస్యూటికల్స్ విభాగం కంట్రీ డివిజన్ హెడ్, దక్షిణాసియా మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఇండియా శ్వేతా రాయ్, కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద, ఎఫ్ఒజిఎస్ఐ పబ్లిక్ అవేర్‌నెస్ కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ ప్రియాంకుర్ రాయ్, కెజిహెచ్ గైనిక్ విభాగ అధిపతి డాక్టర్ సంధ్యాదేవి, గైనకాలజిస్ట్, ఆంకో-గైనకాలజిస్ట్ డాక్టర్ సాయి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నాన్ షెడ్యూల్ ఆదివాసీలకు ప్రత్యేక ఐటిడిఎ కోసం వినతి

ప్రజాశక్తి-సీతమ్మధార : రాజ్యాంగంలోని 5వ షెడ్యుల్ ఆదివాసీల సంక్షేమం అభివృద్ధి కోసం ఏర్పాటుచేసిన ఐటిడిఎ పథకాలు నాన్ షెడ్యూలు ఏరియా ఆదివాసీలకు అందడం లేదని, వారికోసం ప్రత్యేకంగా ఐటిడిఎ ఏర్పాటుచేయాలని జాతీయ ఎస్‌టి కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్‌కు విదసం నేతలు విజ్ఞప్తి చేశారు. విశాఖ పర్యటనలో ఉన్న హుస్సేన్ నాయక్‌ను పోర్టు గెస్ట్‌హౌస్‌లో శనివారం కలసి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఆదివాసీ సమస్యలను ఆయనకు వివరిస్తూ నాన్ షెడ్యూలు ఏరియాలో ఆదివాసీల జనాభా 50శాతానికి పైగా ఉన్న గ్రామాలను ప్రత్యేక కేటగిరిగా గుర్తించి షెడ్యూల్ ఏరియా పంచాయతీకి వర్తించే హక్కులు కల్పించి, ఆదివాసీల భూములకు రక్షణ కల్పించాలని, ఖనిజ సంపద లూటీ కాకుండా కాపాడాలని కోరారు. పొరుగు రాష్ట్రాల నుంచి వలస వచ్చిన ఆదివాసీల పిల్లలకు స్థానికతతో కూడిన కుల ధ్రువీకరణ ఇచ్చేలా అన్నీ రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. దీనిపై కమిషన్ సభ్యులు నాయక్ స్పందిస్తూ, రాష్ట్రపతి, కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆదివాసీలకు కమిషన్ న్యాయం చేస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విదసం నాయకులు వెంకటరావు, ఈతలపాక సుజాత పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం పర్యటనకు విచ్చేసిన జాతీయ ఎస్‌టి కమిషన్ సభ్యులు జె.హుస్సేన్ నాయక్‌ను ఆల్ ఇండియా షెడ్యూల్ ట్రైబల్ ఎంప్లాయిస్ అసోసియేషన్‌కు చెందిన వివిధ కేడర్ల ప్రతినిధులు శనివారం మధ్యాహ్నం హార్బర్ పార్క్‌లోని పోర్ట్ గెస్ట్ హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిసారు. ఆయనను కలిసిన వారిలో అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు పివి.రమణ, జాతీయ కోశాధికారి యామినీ కుమార్, రాష్ట్ర అధ్యక్షులు కోరాబు సత్యనారాయణ, మాజీ రాష్ట్ర అధ్యక్షులు చక్రి నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు చిట్టయ్య, కె.శోభన్ కుమార్ మాజీ కార్యదర్శి, మాజీ గిరిజన భవన్ ట్రెజరర్ డి.పూజ్య శేఖర్ ఉన్నారు.

పోర్టును సందర్శించిన జాతీయ ఎస్‌టి కమిషన్ బృందం

జాతీయ ఎస్‌టి కమిషన్ సభ్యులు జటోతు హుస్సేన్, తెలంగాణ, ఎపిలో ఎస్‌టి కమిషన్ మెంబర్ పర్సనల్ సెక్రెటరీ అశోక్ కుమార్ లక్కార్సు, ఎన్‌సిఎస్‌టి కమిషన్ మెంబర్, సలహాదారులు పివి.రమణలు శనివారం విశాఖపట్నం పోర్టులో పర్యటించారు. ఈ సందర్భంగా పోర్టులో జరుగుతున్న ఎగుమతులు, దిగుమతులు, మౌలిక వసతుల కల్పన, పోర్టు అభివృద్ధి సూచీలు, ఎస్‌టి కమ్యూనిటి కోసం వినియోగిస్తున్న సిఎస్ఆర్ నిధుల వివరాలు, పోర్టులో చేపడుతున్న పచ్చదనం, యాంత్రీకరణ, ఆధునికీకరణ వంటి అంశాలను జాతీయ ఎస్‌టి కమిషన్ మెంబర్‌కు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్ కుమార్ దూబే వివరించారు.

'ఉక్కు' రక్షణకు కార్మికుల ఐక్యతే బలం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

స్టీల్‌ప్లాంట్‌లోని పలు విభాగాలను యాజమాన్యం మూలకు చేర్చుతున్నా.. బ్లాస్ట్ ఫర్నేస్‌లు మూతపడుతున్నా... జీతాలకు ఎగనామం పెడుతున్నా... కార్మికుల ఉక్కు రక్షణ నినాదాలు ఆగలేదు. ఉక్కు ఆస్తులను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కొల్లగొట్టాలని చూస్తున్నా.. సొంత గనులు ఇవ్వకుండా ఎండగడుతున్నా.. జిందాల్ వంటి ప్రైవేట్ కార్పొరేట్లకు మార్కెట్ యార్డులను అమ్మేస్తున్నా... కార్మికులు బెదరకుండా సాగిస్తున్న పోరాటాలు, వారి మధ్య ఐక్యతే 'ఉక్కు పరిశ్రమ'ను ప్రైవేటీకరణ కాకుండా నిలబెడుతున్నాయనడంతో ఎలాంటి సందేహమూ లేదు. ఉక్కు ఫ్యాక్టరీ కోసం భూములను త్యాగం చేసిన నిర్వాసితుల కష్టార్జితమైన 19500 ఎకరాలను కాపాడుకుంటూ స్టీల్ సంస్థ పరుల పాలు కాకుండా రాజకీయ అజెండాగా మార్చేందుకు రెండో వైపు నుంచి సిపిఎం మూడున్నరేళ్లుగా నిర్వహిస్తున్న పాత్ర కూడా పలువురి నోట వినిపిస్తున్న మాట. ఉక్కుకు ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ ఉన్న నేటి రోజుల్లో విశాఖ ఉక్కును సమాధి కట్టి, కార్పొరేట్లకు కట్టబెట్టాలని చూస్తున్న కేంద్రంలోని మోడీ ప్రభుత్వంపై మూడున్నరేళ్లుగా ప్రజా ఉద్యమం విశాఖ కేంద్రంగా నడుస్తోంది.

ప్రైవేటీకరణకు ఎదురు దెబ్బే!

2021 జనవరి 27న కేంద్రంలోని మోడీ సర్కారు విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను వ్యూహాత్మక అమ్మకం (స్ట్రేటజిక్ సేల్) నిర్ణయం చేసిన నుంచీ 1255 రోజులుగా ఉక్కు ఉద్యమం సాగుతూనే ఉంది. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలి వద్ద, విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలకు దేశ వ్యాప్తంగా మద్దతు దక్కుతోంది. అలా ప్రజా, రాజకీయ మద్దతు లభించడంతో తెలుగు రాష్ట్రాల్లో ఉక్కు చర్చనీయాంశమై కేంద్రం 100 శాతం ప్రైవేటీకరించాలన్న నిర్ణయానికి చెంపపెట్టుగా మారింది. కేంద్రం తన నిర్ణయాన్ని మూడున్నరేళ్ల పాటు అమలు చేయలేకపోవడం కార్మిక విజయమే. ఇంకెక్కడి స్టీల్‌ప్లాంట్ మోడీ తలచుకుంటే పనైపోయినట్టే అనే దాన్నుంచి.. అనేకనేక దశల పోరాటాలతో ఉక్కును నిలబెట్టుకోవడం గొప్ప



విషయం. మేం రాష్ట్రంలో అధికారంలోకి వస్తే ప్రైవేటీకరణ కానివ్వం అంటూ 'కూటమి' తరపున 2024 ఎన్నికల ముందు హామీ ఇచ్చిన చంద్రబాబు ఇప్పుడు ఏం చేస్తారో చూడాలి. ఆయన, డిప్యూటీ సిఎం పవన్ ఢిల్లీ పెద్దలపై చేసే రాజకీయ ఒత్తిడిపై స్టీల్‌ప్లాంట్ భవిష్యత్ ఆధారపడి ఉంటుందని పలువురు చెబుతున్నారు.

దిశా నిర్దేశం చేసిన ఉక్కు సెమినార్

తాజాగా స్టీల్‌ప్లాంట్ ట్రైనింగ్ సెంటర్ ఆడిటోరియంలో 'విశాఖ స్టీల్ సంక్షోభం - అధిగమించడం ఎలా?' అన్న అంశంపై జరిగిన సెమినార్ కార్మికులకు దిశా నిర్దేశం చేసింది. కార్మికుల ఐక్యతతో, ప్లాంట్ రక్షణ కోసం జరుగుతున్న ఆందోళనలతో ప్రజలందరికీ ప్లాంట్ నిలదొక్కుకుంటుందన్న విశ్వాసం బలపడుతుండడం ఆశాజనకమైన పరిణామం. తాజాగా జరిగిన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన స్టీల్‌ప్లాంట్ మాజీ సిఎమ్‌డి వై.శివసాగరరావు మాట్లాడుతూ దేశం 2030 నాటికి 300 టన్నుల ఉత్పత్తి సాధించలన్న లక్ష్యం పెట్టుకుందని, స్టీల్‌ప్లాంట్‌కు మౌలిక సదుపాయాలు కల్పిస్తే 100 టన్నులు ఇక్కడ నుంచే ఉత్పత్తి సాధిస్తుందని తెలిపారు. ఆర్‌ఐఎన్‌ఎల్‌ను సెయిల్‌లో విలీనం చేయడం ద్వారా ఇది సాధ్యపడుతుందన్నారు. ఉక్కు సంక్షోభం, నష్టాల్లో ఉందన్నది రాత్రికి రాత్రే జరిగిన పరిణామం కాదని, 2010 వరకూ ఆర్థిక పుష్టితో ప్లాంట్ ఉందని వెల్లడించారు. ఎన్ఎండిసి, సెయిల్, ఆర్‌ఐఎన్‌ఎల్, నాగర్‌నార్, కెఐఒసిఎల్‌ను విలీనం చేసి 'మహా స్టీల్' ఏర్పాటు చేయడం ప్లాంట్‌కు లాభదాయకం అవుతుందని కేంద్రాన్ని డిమాండ్ చేయడం విశేషం.

కాంట్రాక్టు కార్మికులు నెలల తరబడి జీతాలకు నోచుకోకపోవడం, ఉద్యోగులు, కార్మికుల జీతాలకు ఠికానా లేకపోవడం వంటి సంక్షోభాన్ని పాలకులే సృష్టించారంటూ సిఐటియూ జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ కేంద్రాన్ని ఆ సెమినార్‌లో తప్పుబట్టారు.

నిండుతున్న జలాశయాలు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి : అల్పపీడన ప్రభావంతో శుక్రవారం రాత్రి వరకు కురిసిన వర్షాలతో జలాశయాలు కళకళలాడుతున్నాయి. ఈ సీజన్ ఖరీఫ్‌కు సకాలంలో నీరు విడుదల చేయడానికి తగిన నీరు ఇప్పటికే జలాశయాల్లో చేరింది. వరద తాకిడి పెరిగినప్పటికీ.. ఇప్పటికీ తాండవ, రైవాడ జలాశయాల్లో గతేడాది కంటే నీటిమట్టం తక్కువగానే వుంది. వరద నీరు పోటెత్తడంతో వరహా స్పిల్‌వే నుంచి వంద, పెద్దేరు జలాశయం నుంచి 219 క్యూసెక్కుల నీటిని విడుదలచేశారు. తాండవలో 57, రైవాడలో 56, కోణాంలో 35, వరహాలో 18, పెద్దేరులో 60 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జలాశయ ఉపరితలంపైన కురిసిన వర్షాలతో తాండవకు 1273, రైవాడకు 810, కోణాంకు 120, వరహాకు 100, పెద్దేరుకు 94 క్యూసెక్కుల చొప్పున వరద నీరు వచ్చిచేరింది. మూడు రోజులపాటు కురిసిన వర్షాలతో రైతుకు ఉపశమనం కలిగినట్లయింది. ఖరీఫ్‌కు ఆకుమడులు సిద్ధం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో పొలాల్లో నీరు చేరడంతో ఉడుపులకు సమాయత్తమవుతున్నారు. ఇంకా వర్షాలు పడితేగానీ సంతృప్తికరస్థాయికి తాండవ, రైవాడ జలాశయాలు వచ్చేలాలేవు. తాండవ పూర్తిస్థాయి నీటిమట్ట సామర్థ్యం 380 అడుగులకు శనివారం నాటికి 365.40 అడుగులకు చేరింది. రైవాడలో 114 మీటర్లకు 106.65 మీటర్లు, కోణాంలో 101.25 మీటర్లకు 98.45 మీటర్లు, వరహాకు 460 అడుగులకు 458.50 అడుగులు, పెద్దేరులో 137 మీటర్లకు 136 మీటర్లు నీరు జలాశయాల్లో వుంది.

హుదూద్ ఇళ్లకు తాళాలు వేసిన రైతులు

ప్రజాశక్తి -పిఎం పాలెం : తమ పట్ల ఏపీ హౌసింగ్ కార్పొరేషన్, రెవెన్యూ నిర్లక్ష్య చర్యలకు నిరసనగా కొమ్మాది, బక్కన్నపాలెం, రేవళ్లపాలెం రైతులు హుదూద్ ఇళ్లకు శనివారం తాళాలు వేశారు. భూములు కోల్పోయి తీవ్రంగా నష్టపోయిన తమకు ఇస్తామన్న ఇళ్ల ఇవ్వకుండా అన్యాయం చేస్తారా అంటూ శనివారం వారి భూముల్లో నిర్మించిన ఎన్‌టిఆర్ హుదూద్ ఇళ్ల వద్ద నిరసన చేపట్టారు. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పెద్దలు బి.పోతురాజు, ఎస్.పైడిరాజు మాట్లాడుతూ, అమాయకులు, పేదలైన రైతులను దగా చేశారన్నారు. తమ భూముల్లో నిర్మించిన ఇళ్లను తమకు ఇస్తామని హామీ ఇచ్చి నేటికీ అప్పగించలేదన్నారు.

సిపిఎం నాయకులు డి.అప్పలరాజు మాట్లాడుతూ, భూములు కోల్పోయి తీవ్రంగా నష్టపోయిన రైతులకు ఇళ్లు ఇచ్చేవరకు ఆ గృహ సముదాయంలో ఎవరికీ కేటాయించబోమని, రైతులకు ఇచ్చాకే కేటాయిస్తామని ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్, కలెక్టర్ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రైతులకు ఇళ్ల ఇవ్వకుండా వేరే ప్రాంతాలకు చెందిన వారికి కేటాయించారని, ఇది అన్యాయమని అన్నారు. ఇప్పటికైనా రైతులకు ముందు ఇళ్లు ఇచ్చి తర్వాతే ఈ గృహ సముదాయాన్ని అధికారికంగా ప్రారంభించాలని కోరారు. రైతులకు న్యాయం జరిగే వరకూ ఈ పోరాటం ఆగదని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు ఎస్.పైడితల్లి, కె.నాగరాజు, ఎస్.అక్కయ్యమ్మ, ఎస్.అప్పారావు, కనకరాజు, వెంకట అప్పారావు, రైతులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న రైతులు

నేరాలు ఘోరాలు

భవన నిర్మాణ కార్మికుడు దుర్మరణం

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 9వ వార్డు పరిధి విశాలాక్షినగర్‌లో నిర్మాణంలో ఉన్న భవనంపై నుంచి పడి భవన నిర్మాణ కార్మికుడు శనివారం దుర్మరణం చెందాడు. విశాలాక్షినగర్‌లో ప్రధాన రహదారిలో ఒక భవనం నిర్మాణం జరుగుతోంది. 10వ వార్డు పరిధి రవీంద్రనగర్‌లో నివాసం ఉంటున్న తాపీ మేస్త్రి రౌతు పాపారావు (50) శనివారం ఆ భవన నిర్మాణ పనికి వెళ్లాడు. భవన నిర్మాణ సామగ్రిని భవనంపైకి ఎక్కించే లిఫ్ట్ బిగించేందుకు మరి కొంత మంది కార్మికులతో కలిసి సన్నాహాలు చేస్తున్నారు. ఈ క్రమంలో లిఫ్ట్‌తో పాటు కిందపడిపోయాడు. లిఫ్ట్ పెట్టె మొత్తం పాపారావుపై పడిపోవడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. విజయనగరం జిల్లా మెంటాడ మండలం, పోరాం గ్రామానికి చెందిన పాపారావు పని కోసం విశాఖ వచ్చి కొన్నేళ్లుగా రవీంద్రనగర్‌లో భార్య గౌరి, ఇద్దరు పిల్లలతో కలిసి నివాసముంటున్నారు. పాపారావు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరిలోవ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

విమ్స్‌లో స్టాఫ్ నర్స్ భర్త వీరంగం

ప్రజాశక్తి - ఆరిలోవ : విమ్స్ ఆసుపత్రిలో ఒక ఇన్‌ఛార్జి స్టాఫ్ నర్స్ భర్త వీరంగం సృష్టించాడు. తిరిగి డిఎంఇకి ఆస్పత్రి మీద ఫిర్యాదు చేశాడు. విమ్స్ ఆస్పత్రిలో పనిచేస్తున్న ఇన్‌ఛార్జి స్టాఫ్ నర్స్ తన భర్తను తీసుకొని ఈసీజీ పరీక్ష కోసం ఆ గది వద్దకు వచ్చారు. అప్పటికే ఒక మహిళా రోగికి గది లోపల ఈసీజీ తీయడంతో సిబ్బంది తలుపులు మూసివేసి ఉంచారు. తలుపులు తెరవాలంటూ స్టాఫ్ నర్స్ భర్త హడావుడి చేశారు. తలుపులు తెరిచిన తర్వాత సదరు సిబ్బందిపై ఆయన తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశాడు. 'స్టాఫ్ నర్స్ భర్తనైన నాకే మీరు డోర్ ఓపెన్ చేయరా, మీరు ఇలాగేనా చూస్తారు' అంటూ అరిచాడు. అంతటితో ఆగకుండా వారి మీద ఉన్నత అధికారులకు, డిఎంఇకి ఫిర్యాదు చేశారు. దీని మీద విచారణ చేపట్టిన డైరెక్టర్ ఒక మహిళకు ఈసీజీ చేస్తున్నప్పుడు డోర్ ఎలా తెరుస్తారని ఇన్‌ఛార్జి స్టాఫ్ నర్స్‌ని పిలిచి మందలించారు.

సింహగిరిపై ఎలక్ట్రిక్ బస్సులు

ప్రజాశక్తి- సింహాచలం : సింహాచలం దేవస్థానం కొండ దిగువ నుంచి పైకి ప్రయాణించుటకు దేవస్థానం సుమారు రూ.1.65 కోట్లతో కొనుగోలు చేసిన ఎలక్ట్రికల్ బస్సులను శనివారం ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు ప్రారంభించారు. ఆలయ కార్య నిర్వహణాధికారి ఎస్.శ్రీనివాస్‌మూర్తి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసరాజు డిప్యూటీ ఇంజినీర్ హరిరాజు, దేవస్థానం సిబ్బంది ఈ బస్సుల్లో ప్రయాణించారు. తదుపరి అశోక్‌గజపతిరాజు స్వామి వారిని దర్శించుకున్నారు.

వేపగుంటలో ట్రాఫిక్ జామ్

ప్రజాశక్తి-పెందుర్తి : గిరిప్రదక్షిణను పురస్కరించుకొని వాహనాలను వేపగుంట వైపు పోలీసులు మళ్లించారు. దీంతో నాయుడుతోట నుంచి పెందుర్తి వెళ్లే వాహనాలతో వేపగుంటలో ట్రాఫిక్ జామ్ అయింది. నాయుడుతోట నుంచి పెందుర్తి వెళ్లేందుకు సుమారు అరగంట పైనే పట్టింది.

వరి నారు మళ్లను పరిశీలించిన వ్యవసాయాధికారి

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని పాండ్రంగి, గంధవరం, అనంతవరం గ్రామాల్లో వరి నారు మళ్లు, జీలుగ పంటలను శనివారం జిల్లా వ్యవసాయాధికారి కె.అప్పలస్వామి శనివారం పరిశీలించారు. వారంరోజులలో వరి నారు తీస్తామనగా 5 సెంటుల నారు మడికి క్యాబోఫురాన్ వాసనరాని గుళికలు 3జి 800 గ్రాములు వేస్తే ఉడుపు అయిన 30 రోజుల వరకు చీడపీడలు ఆశించవని తెలిపారు.

ప్రమాదకరంగా గవరగెడ్డ కల్వర్టు



కింది నుంచి కోతకు గురైన రహదారి

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం మండలం సొంఠ్యాం పంచాయతీ ఆబోతువానిపాలెం గ్రామానికి వెళ్లే రహదారిలో గవరగెడ్డ కోతకు గురై ప్రమాదాలకు లలియంగా మారింది. సొంఠ్యాం బీఆర్‌టీ రోడ్డు నుంచి ఆబోతువానిపాలెం మీదుగా కనమాం వరకు సుమారు 1.4 కిలోమీటర్లు రోడ్డు ఏర్పాటుకు నాబార్డు నిధులు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి పాత గెడ్డ రహదారికి రెండు పైపులు పెట్టి తాత్కాలికంగా రహదారి ఏర్పాటు చేశారు. దాని పక్కనే కొత్త బ్రిడ్జి పనులు ప్రారంభించి మధ్యలోనే వదిలేశారు. ప్రస్తుతం వర్షాలకు పాత రహదారి శిథిలావస్థకు చేరుకొని ప్రమాదాలకు నిలయంగా మారింది. ఇక్కడ తరచూ ప్రమాదాలు జరిగి గాయాలపాలయ్యే సంఘటనలు ఉన్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. ఇటీవల ఆబోతువానిపాలెం గ్రామానికి చెందిన చల్లా వీరాస్వామి (37) బైక్‌పై వస్తుండగా అదుపుతప్పి గెడ్డలో పడి మృతి చెందాడు. దీంతో గ్రామస్తులు ఈ గెడ్డ దగ్గరకు వచ్చేసరికి భయాందోళన చెందుతున్నారు. కనీసం కల్వర్టు పనులైనా చేపట్టాలని ఆబోతువానిపాలెం గ్రామస్తులు కోరుతున్నారు.

లోతట్టు ప్రాంతాల్లో టిడిపి నాయకుల పర్యటన

గాజువాక : జివిఎంసి 75వ వార్డు పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లో టిడిపి నాయకులు పులి లక్ష్మీబాయి, వెంకటరమణా రెడ్డి శనివారం పర్యటించారు. ఎంపి రాపిడ్ యాక్షన్ పోర్సులను ఉపయోగించి నీరు కాలువల ద్వారా పోయేలా చర్యలు తీసుకున్నారు. కాలువలలో పేరుకు పోయిన చెత్తను తొలగించారు. ఈ పర్యటనలో జివిఎంసి డిఇ అప్పారావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ సూర్యారావు, నాగేష్, ములకలపల్లి పెంటయ్య, గొందేసి రామిరెడ్డి పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్డులో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటుచేయాలి

ప్రజాశక్తి -ఆనందపురం: దుక్కవానిపాలెం నుంచి తర్లువాడ పెట్రోల్ బంకు వైపు వెళ్లే సర్వీస్ రోడ్డులో స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయాలని పలువురు నాయకులు, గ్రామస్తులు కోరుతున్నారు. ఆనందపురం నుంచి పెందుర్తి వెళ్లే నేషనల్ హైవే చెక్ పోస్ట్ సమీపం సర్వీస్ రోడ్డులో దుక్కవానిపాలెం నుంచి తర్లువాడ పెట్రోల్ బంకు మార్గంలో కొండను సరిచేసి సర్వీస్ రోడ్డు వేయడంతో కొంత ఒంపుగా నిర్మాణం జరిగింది. ఈ సర్వీస్ రోడ్డు ద్వారా రెండు వైపుల నుంచి వాహనాలు అతివేగంతో రావడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిని ప్రభుత్వ అధికారులు పరిశీలించి హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బేకర్లు ఏర్పాటుచేయాలని తర్లువాడ గ్రామానికి చెందిన కోరాడ ఆదినారాయణ, బంకు అప్పలరాజు, గ్రామస్తులు కోరుతున్నారు.

గోస్తనీకి జల కళ

ప్రజాశక్తి -పద్మనాభం : మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గోస్తనీ నది ఉరకలు వేస్తోంది. భీమిలి సముద్రం వైపు గలగలా ఉరకలు వేస్తుండటంతో అందరూ ఆగి చూస్తున్నారు. మండలంలోని పాండ్రంగి గ్రామంలో శనివారం ఆ గ్రామానికి చెందిన కొంతమంది గ్రామస్తులు గోస్తని నదిలో సీసీ రోడ్డుపై నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. వర్షపు నీరు ప్రమాద స్థాయిలో ప్రవహిస్తున్నా వారి అవసరాలు కోసం రాకపోకలు చేయడం ప్రమాదకరంగా ఉంది.



నిండుగా పారుతున్న గోస్తనీ



పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్

పాడి రైతులకు అవగాహనా సదస్సు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యాన మండలంలోని రేఖవానిపాలెంలో శనివారం పలు అంశాలపై పాడి రైతులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా పశు సంవర్ధక శాఖ జిల్లా ఉప సంచాలకులు డాక్టర్ ఎం.చంద్రశేఖర్ హాజరై మాట్లాడుతూ, వర్షాలకు తడవకుండా, పిడుగులు పడితే ప్రాణ నష్టం జరగకుండా రక్షిత ప్రదేశంలో పశువులను ఉంచాలని సూచించారు. వర్షాలు కురిసిన సమయంలో ఆరు బయట మేతకు తీసుకు వెళ్లవద్దని స్పష్టం చేశారు. సమీకృత దాణాలు, పచ్చగడ్డి అందించడం ద్వారా పాల దిగుబడిలో మెరుగుదల ఉంటుందని తెలిపారు. పశువులకు గోరు వెచ్చని నీటిని అందివ్వాలని, ఖనిజ లవణాల మిశ్రమాలను తినిపించాలని సూచించారు. ఈ సదస్సులో పశు వైద్య శాల భీమిలి డివిజన్ సహాయ సంచాలకులు డాక్టర్ బి వెంకటరమణ, తాళ్లవలస పశువైద్యాధికారి డాక్టర్ ప్రశాంతి, సిబ్బంది శివకృష్ణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం 142 పశువులకు వివిధ రకాల జబ్బుల నివారణకు టీకాలు వేశారు.

గాయత్రిలో మిషన్ స్మైల్ ప్రారంభం

ప్రజాశక్తి -మధురవాడ : గాయత్రి విద్యా పరిషత్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ కేర్ అండ్ మెడికల్ టెక్నాలజీలో గ్రహణం మొర్రి శస్త్రచికిత్స శిబిరాన్ని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్య, వైద్యం రెండు కళ్లుగా గాయత్రి విద్యా పరిషత్ భావిస్తోందని చెప్పారు. ఈ ఆపరేషన్ల కోసం 150 మంది వరకు పేర్లు నమోదు చేసుకున్నారని, ఇంకా ఎవరైనా ఉంటే ఆసుపత్రిని సంప్రదించాలని సూచించారు. ఇలాంటి సంస్థలకు ప్రభుత్వం పూర్తి సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉందన్నారు. అనంతరం గాయత్రి విద్యా పరిషత్తుల కార్యదర్శి పి.సోమరాజు మాట్లాడుతూ ఆసుపత్రి ద్వారా అందిస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆపరేషన్స్ మెడికల్ సూపరింటెండెంట్ కె.సల్యవరప్రసాద్, బోర్డు ఆఫ్ మిషన్ స్మైల్‌లో రామ్‌కుమార్ వెంకటేశ్వరన్, ముత్తూట్ పప్పచన్ గ్రూప్ హెడ్ ప్రశాంత్ కుమార్ నెల్లికల్, బెడ్ ముత్తూట్ ఫిన్ కార్ప్ లిమిటెడ్ బినోద్ కోలా, మిషన్ స్మైల్ డైరెక్టర్ దిలీప్ పాండే, గాయత్రీ విద్యా పరిషత్ డీన్ పి.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్ చేయాలని వినతి

విశాఖపట్నం జిల్లాలో ఎన్‌టిఇపిలో పనిచేస్తున్న క్షయ సిబ్బంది రెగ్యులర్ చేయాలని కోరుతూ గాయత్రి మెడికల్ కాలేజీకి వచ్చిన భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు వైద్య ఆరోగ్యశాఖ టీబీ విభాగం ఆధ్వర్యాన వినతిపత్రం అందించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో సుమారు 30 మంది క్షయ విభాగంలో 21 సంవత్సరాల నుంచి పనిచేస్తున్నారని జిల్లా ఫైన్ నివారణ విభాగం ప్రెసిడెంట్ ఎంవిఐ గోపీనాథ్, యూనియన్ సెక్రటరీ వి వీరబ్రహ్మం, సభ్యులు సురేష్, అరుణ్ కుమార్ వివరించారు. ల్యాబ్ టెక్నీషియన్లు, ల్యాబ్ సూపర్‌వైజర్లు, ట్రీట్మెంట్ సూపర్‌వైజర్లు, టిబిహెచ్‌విఎస్‌లుగా పనిచేస్తున్నారని తెలిపారు. డిఎం అండ్ హెచ్‌ఓ కాంట్రాక్ట్ ల్యాబ్ టెక్నీషియన్లకు రూ.32,670 జీతం ఇవ్వగా, క్షయ విభాగంలో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లకు రూ.23,394 మాత్రమే ఇస్తున్నారని వివరించారు. ఏటా ఇవ్వాల్సిన 5 శాతం ఇంక్రిమెంట్ కూడా గత ఐదేళ్ల నుంచి ఇవ్వలేదని తెలిపారు. దీని వల్ల వల్ల క్షయ విభాగంలో పనిచేస్తున్న ఒక్కొక్క ఉద్యోగి ఏటా రూ.20 వేలు చొప్పున ఐదేళ్లలో రూ.లక్ష నష్టపోయారని వివరించారు. క్షయ విభాగ సిబ్బంది సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు.



గంటా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందిస్తున్న గోపీనాథ్, వీరబ్రహ్మం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ధీరజ్ మిశ్రా

తృతీయ శ్రేణి నగరాల్లో ఆకాష్ సేవలు

- అకడమిక్, బిజినెస్ హెడ్ ధీరజ్ మిశ్రా

ప్రజాశక్తి -గాజువాక : ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలలో ఆకాష్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ సేవలను విస్తరించనున్నట్టు నేషనల్ అకాడమిక్ బిజినెస్ హెడ్ ధీరజ్ మిశ్రా తెలిపారు. గాజువాకలోని ప్రముఖ నివాస కేంద్రం సెలెస్ట (బిజినెస్ కేంద్రం)లో ఆకాష్ విద్యాసంస్థల కార్పొరేట్ బ్రాంచ్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. నీట్, జెఇఇ ర్యాంకుల సాధనలో అగ్రగామి సంస్థగా పేరొందిన తమ సంస్థకు రాష్ట్రంలో ఇది 11వ కేంద్రమని తెలిపారు. విశాఖ, విజయవాడ, తిరుపతి ప్రాంతాలతో పాటు కాకినాడ, రాజమండ్రి, కడపలో శాఖలు ఉన్నాయని పేర్కొన్నారు. విశాఖలో తమ మూడవ కేంద్రం గాజువాక అని తెలిపారు. తెలంగాణలో 12 శాఖలు, దేశంలో 300కు పైగా శాఖలు ఉన్నాయని వివరించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఆన్‌లైన్ మోడ్‌లో ఆకాష్ కోర్సులు అందిస్తూ నీట్, జెఈఈలలో ఉత్తమ ర్యాంకులు సాధించడంలో అగ్రగామి సంస్థగా గుర్తింపును సంపాదించుకుందన్నారు. పేద విద్యార్థులను ప్రోత్సహించే దిశగా ఆకాష్ స్కాలర్‌షిప్ ప్రోగ్రాం అందిస్తున్నామన్నారు. 90 శాతం వరకు ఫీజులో రాయితీతో పాటు నాసాను సందర్శించే అవకాశాన్ని కూడా తాము కల్పిస్తున్నట్లు తెలిపారు. నూతనంగా ప్రారంభించిన గాజువాక కేంద్రంలో 8, 9, 10 తరగతులకు ఫౌండేషన్ కోర్సులు, ఇంటర్ విద్యార్థులకు ఇంటిగ్రేటెడ్ కోర్సులు, ఇంటర్ పూర్తి చేసిన వారికి లాంగ్ టర్మ్ కోర్సులు అందిస్తూ భావితరాలను డాక్టర్లు, ఇంజినీర్లుగా తీర్చిదిద్దడంలో తాము ముందంజలో ఉన్నామని గర్వంగా చెబుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డిప్యూటీ డైరెక్టర్ ఎ.మూర్తి, బిజినెస్ మేనేజర్ దీపక్ మిత్రా, బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్ రాజేష్, అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార రైతుబజార్‌కు 5 టన్నుల టమాటా

ప్రజాశక్తి-సీతమ్మధార : రాష్ట్ర ప్రభుత్వం అందించే సబ్సిడీ టమోటాలు సీతమ్మధార రైతు బజార్‌కు 5 టన్నుల వచ్చినట్లు ఎస్టేట్ ఆఫీసర్ ఇ.కొండబాబు తెలిపారు. వినియోగదారులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా క్యూలైన్ ప్రకారం అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. మార్కెటింగ్ శాఖ ఏడి యాసిన్ పర్యవేక్షణలో వినియోగదారులకు టమోటాలు విక్రయించినట్లు అని తెలిపారు.

' విద్వేషాలను రెచ్చగొడుతున్న జగన్'

ప్రజాశక్తి -గాజువాక : రాష్ట్రంలో విద్వేషాలను రెచ్చగొట్టేందుకు వైయస్ జగన్మోహన్‌రెడ్డి ప్రయత్నం చేస్తున్నారని తెలుగు శక్తి అధ్యక్షుడు బివి.రామ్ ఆరోపించారు. గాజువాకలోని ఎస్‌బిటి హోటల్‌లో శనివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

సామాజిక అభివృద్ధికి పనిచేయాలి

ప్రజాశక్తి -ములగాడ : సామాజిక అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని మల్కాపురంలోని సెయింట్ జోసెఫ్ చర్చి ఫాదర్ ప్రదీప్ సూచించారు. సెయింట్ ఆన్స్ కళాశాలలో సెయింట్ ఆన్స్ ఫీస్ట్ సందర్భంగా ఆయన ముఖ్యవక్తగా హాజరై ప్రసంగించారు. ప్రతి ఒక్కరూ ఎల్లప్పుడూ సామాజిక సేవకు సంసిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ కేస్లీన్, సిస్టర్లు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు రైన్ కోట్లు

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి అందించిన రైన్ కోట్లను 97వ వార్డు పరిధి జివిఎంసి కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు వారు కార్పొరేటర్ సేనాపతి వసంత శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వర్షం కాలం నేపథ్యంలో పారిశుధ్య కార్మికులకు రైన్ కోట్లు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

వైభవంగా గిరిప్రదక్షిణ

ప్రజాశక్తి-యంత్రాంగం

సింహాచలం: భక్తుల హరినామ స్మరణతో శనివారం సాయంత్రం 4 గంటలకు సింహాచల దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు రథానికి జెండా ఊపి గిరిప్రదక్షిణను ప్రారంభించారు. గిరిప్రదక్షిణ వేళ భక్తులు శనివారం వేకువజాము నుంచే తొలిపావంచ వద్ద కొబ్బరికాయ కొట్టి గిరిప్రదక్షిణను ప్రారంభించారు. ఉదయం నుంచి కురుస్తున్న వర్షానికి నెమ్మదిగా ప్రారంభమైన భక్తుల రాక మధ్యాహ్నం వర్షం ఆగిపోవడంతో లక్షలాదిగా తరలివచ్చి గిరిప్రదక్షిణలో పాల్గొన్నారు. యువతీయువకులు, మహిళలు, వృద్ధులు, చిన్నారులు అనే తేడా లేకుండా గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. రథం ముందు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు.

గిరిప్రదక్షిణలో పాల్గొనే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా స్వచ్ఛంద సేవా సంస్థలు, దేవస్థానం అధికారులు ఉచిత వైద్య శిబిరాలు, ఉచిత ప్రసాద వితరణ, మంచినీటి సదుపాయాన్ని ఎక్కడికక్కడ ఏర్పాటుచేశారు భక్తులు సేద తీరేందుకు గుడారాలను ఏర్పాటుచేసి కుర్చీలు వేశారు. జోడిగుళ్లపాలెం వద్ద సముద్ర స్నానం చేసే భక్తులకు ఎటువంటి ప్రమాదం జరగకుండా గజ ఈతగాలను అందుబాటులో ఉంచారు. కొండ చుట్టూ గట్టి పోలీసు భద్రతను ఏర్పాటుచేశారు. మరుగుదొడ్లను ఎక్కడికక్కడ ఏర్పాటుచేశారు. రథయాత్ర ప్రారంభమైన తర్వాత రెండో ఘాట్ రోడ్డు వద్ద భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వచ్చి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజ నిర్వహించారు. ఆయన వెంట వార్డు కార్పొరేటర్ పీవీ నరసింహం, భీమిలి నియోజకవర్గం నాయకులు కోరాడ రాజబాబు తదితరులు స్వామిని దర్శించారు.

ప్రసాద వితరణలు

ఆరిలోవ : గిరి ప్రదక్షిణ సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం, జివిఎంసి, స్వచ్ఛంద సేవా సేవా సంస్థలు, కాలనీ సంఘాలు దారి పొడవునా పలు సౌకర్యాలు కల్పించాయి. బిఆర్‌టిఎస్ రహదారి హనుమంతువాక నుంచి సింహాచలం దేవస్థానం వరకు మంచినీటి సౌకర్యం, మొబైల్ టాయిలెట్స్, వైద్య శిబిరాలు, అన్న ప్రసాదాల కౌంటర్లు ఏర్పాటు చేశారు. విశ్వాస్ సంస్థ బిఆర్‌టిఎస్ రోడ్డు జివిఆర్ తార్ షెడ్డు వద్ద సుమారు వెయ్యి మందికి అన్న ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం టీ, కాఫీలతో పాటు బిస్కెట్లు సమకూర్చారు. ముడసర్లోవ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన స్కిల్‌డెవలెప్‌మెంట్ వద్ద నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పాల్గొని అన్న ప్రసాదాలను భక్తులకు పంచి పెట్టారు.


మజ్జిగ పంపిణీచేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

పెందుర్తి : ఎస్ఎస్ఆర్, ఆర్కె ఫంక్షన్ హాల్ యాజమాని బి.వెంకటకృష్ణారెడ్డి ఆధ్వర్యాన అన్న ప్రసాద వితరణ చేపట్టారు.

పిఎం పాలెం : భీమిలి నియోజకవర్గం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు తెలుగు యువత ఉపాధ్యక్షులు కెవిఆర్ కేటరింగ్స్ అధినేత గరే గురునాథ్ ఆధ్వర్యాన కైలాసగిరి ప్రవేశ కూడలి వద్ద భక్తుల కోసం ఉచితంగా స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ స్టాల్ వద్ద పులిహోర, చాక్లెట్స్, బిస్కెట్స్ తదితర పదార్థాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చిక్కాల విజయ్‌బాబు, రెడ్డి సత్యనారాయణ, కొప్పాక రామకృష్ణ, వాండ్రాశి భాస్కర్, కోరగంజి సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార : అక్కయ్యపాలెం పోర్ట్ స్టేడియం వద్ద భక్తులకు అన్న ప్రసాదం, మజ్జిగను స్వచ్ఛంద సంస్థలు పంపిణీ చేశాయి. స్థానిక ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు పాప హోమ్స్ వద్ద ప్రసాద వితరణ అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్యామల దీపిక పాల్గొన్నారు.

పోర్ట్ స్టేడియం వెనుక రోడ్డులో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో రోటరీ క్లబ్, వీ హెల్త్ కేర్, స్నేహ సంధ్య ఏజ్ కేర్ ఫౌండేషన్, యెరుమేలు అయ్యప్ప సేవా ట్రస్ట్ సంయుక్త సహకారంతో పలు వైద్య సేవలు అందించారు. అస్వస్థతకు గురైన భక్తులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 3 బృందాలుగా 60 మంది వైద్య సిబ్బంది, వాలంటీర్లు స్వచ్ఛంద సేవలందించారు. డాక్టర్ ఎల్‌వి.ఉషారాణి, డాక్టర్ ఎస్.సురేష్, డాక్టర్ పరివీన్ వైద్య సేవలందించారు. రోటరీక్లబ్ ప్రెసిడెంట్ ఎమ్‌డి.యాసిన్, సెక్రటరీ చింతా నేతాజీ, వీ హెల్త్ కేర్ డైరెక్టర్ కెఎమ్‌కె.రమేష్, చీఫ్ మేనేజర్ చిన్నంకృష్ణ, పి.శ్రీ రామ్మూర్తి, ఎమ్. సుమతి పాల్గొన్నారు.

అప్పుఘర్‌లో కలెక్టర్ పర్యటన

ఎంవిపి.కాలనీ : లక్ష్మీ నృసింహస్వామి గిరి ప్రదక్షిణలో భాగంగా భక్తుల సౌకర్యార్థం అప్పుఘర్ వద్ద ఏర్పాటు చేసిన స్నాన ఘట్టాన్ని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ పరిశీలించారు. శనివారం అక్కడకు వెళ్లిన ఆయన పరిస్థితిని సమీక్షించారు. కాసేపు ఉండి భక్తుల రాకపోకలను గమనించారు. అధిక సంఖ్యలో భక్తులు వస్తుండటంతో ఇన్ గేట్, అవుట్ గేట్ వద్ద భద్రతా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, భక్తుల రద్దీతో క్యూలైన్ స్ట్రక్ అవ్వకుండా జాగ్రత్తగా పర్యవేక్షించాలని సూచించారు. అక్కడ పరిస్థితిని పర్యవేక్షిస్తున్న ఎస్‌పి ర్యాంకు అధికారితో కలెక్టర్ కాసేపు మాట్లాడారు. అప్రమత్తంగా ఉండాలని, భక్తుల తోపులాట జరగకుండా చూసుకోవాలని చెప్పారు. దుస్తులు మార్చుకునే గదుల వద్ద, స్నాన ఘట్టం పరిధిలో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా, ప్రక్రియ సజావుగా, సులభంగా జరిగేలా జాగ్రత్త వహించాలని అక్కడున్న అధికారులను కలెక్టర్ ఆదేశించారు.


అప్పుఘర్ వద్ద స్నానఘట్టాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

ట్రాఫిక్ ఏర్పాట్లను పరిశీలించిన సిపి

ఆరిలోవ : గిరి ప్రదక్షిణ నేపథ్యంలో ట్రాఫిక్ ఏర్పాట్లను నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ శనివారం ఉదయం హనుమంతువాక, అడివివరం బిఆర్‌టిఎస్ రోడ్డును స్వయంగా పరిశీలించారు. శనివారం ఉదయం నుంచే భక్తులు గిరి ప్రదక్షిణ ప్రారంభించారు. చాలా మంది భక్తులు దేవస్థానం తొలి పావంచా నుంచి బయలుదేరేందుకు ముందుగా హనుమంతువాక మీదుగా ద్విచక్రవాహనాలు, కారులు, ఆటోలతో తొలి పావంచా చేరేందుకు పోటెత్తారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఈ ఏడాది బిఆర్‌టిఎస్ రోడ్డు కేంద్రకారాగారం వద్ద ఆటోలతో వస్తున్న భక్తులను అక్కడ దింపేసి ఆటోలను వెనక్కి పంపించేసారు. అక్కడ నుంచి భక్తులకు అసౌకర్యం కలగకుండా సిటీ బస్సుల్లో తరలించారు. ఇదంతా నగర్ పోలీస్ కమిషనర్ దగ్గరుండి పర్యవేక్షించారు.



ట్రాఫిక్ ఏర్పాట్లును పర్యవేక్షిస్తున్న సిపి బాగ్చీ

రహదారి జలమయం

రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు

ప్రజాశక్తి- గోపాలపట్నం : కొత్తపాలెం నుంచి నరవ వెళ్లే ప్రధాన రహదారి జలమయంగా మారడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలిగాయి. నరవ నుంచి కొత్త పాలెం మీదుగా గోపాలపట్నం వెళ్లే ప్రజలు, కొత్తపాలెం మీదుగా నరవ నుంచి సబ్బవరం వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ద్విచక్ర వాహనాలు, కారులు నీటిలో మునిగిపోయి ముందుకు సాగటానికి మొరాయిస్తున్నాయి. జివిఎంసి 89వ వార్డు శివారులో దేవస్థానం, ప్రభుత్వ బంజరు, కొంత రెవెన్యూ భూములు ఉన్నాయి. గోపాలపట్నం ప్రాంతానికి దగ్గరగా ఉండటంతో ఇక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతోంది.

గెడ్డలు, చెరువుల ఆక్రమణతో ఇబ్బందులు

స్థానిక వైసిపి నాయకుడు పలుకుబడితో గత ఏడాది ఇక్కడ బహుళ అంతస్తు భవంతిని నిర్మించాడు. గెడ్డ స్థలాన్ని కొంత కబ్జా చేసి భవనాన్ని నిర్మించాడు. అంతటితో ఆగకుండా ఎగువ నుంచి వస్తున్న నీరు తన భవనం వైపు రాకుండా ఉండటానికి ప్రధాన రహదారి పైనే గ్రావెల్ వేసి రోడ్డును ఎత్తి చేయించాడు. ఇదే తరుణంగా భావించిన మరి కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇక్కడ పారే గెడ్డలను, చెరువులను గ్రావెల్‌తో కప్పించి చదును చేసి నీరు పోకుండా అడ్డుకున్నారు. దీంతో ఈ రహదారిపై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు మొదలయ్యాయి.

ప్రభుత్వ పరిరక్షణ కరువు

ఇక్కడ దేవస్థానం, ప్రభుత్వ బంజరు, జిరాయితీ భూములు ఉన్నాయి. తప్పుడు పత్రాలు సృష్టించి ప్రభుత్వ బంజరు, దేవస్థానం భూముల విక్రయాలు జరుపుతున్నారు. దీనిపై ప్రభుత్వ అధికారులు స్పందించకపోవడంతో కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆడిందే ఆట పాడిందే పాటగా సాగుతుంది.

తూతూ మంత్రంగా చర్యలు

గత రెండు మూడు రోజులుగా కురిసిన వర్షాలకు మేఘాద్రి రిజర్వాయర్ ఎగువ నుంచి నీటి ప్రవాహం దిగు ప్రాంతానికి చేరుకుంది. ఇక్కడ గెడ్డలు, కాలువలు కబ్జాకుగురి కావడంతో రహదారులన్నీ జలమయంగా మారాయి. విషయం తెలుసుకున్న జివిఎంసి అధికారులు గతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు పూడ్చిన కాలువలోని మట్టిని తొలగించి తాత్కాలికంగా నీరు పోవడానికి ఏర్పాట్లు చేశారు. శాశ్వత పరిష్కారం చూపించాలని స్థానికులు కోరుతున్నారు



జలమయంగా మారిన నరవ ప్రధాన రహదారి

రైతులు, కూలీల సమస్యలను పరిష్కరించాలి


రైతు సంఘం, వ్యకాస, సిఐటియు నేతల వినతులు



తహశీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న రైతు నాయకులు

ప్రజాశక్తి - యలమంచిలి

రైతులు, వ్యవసాయ కూలీలు, ఉపాధి హామీ కూలీల సమస్యలను పరిష్కరించాలని ఎపి రైతు సంఘం, సిఐటియు నాయకులు శనివారం యలమంచిలి తహశీల్దార్ అప్పలరాజుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, సిఐటియు మండల కన్వీనర్ సిహెచ్.శివాజీ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని, రైతులకు కొత్త ప్రభుత్వం ఇస్తామన్న రూ.20 వేలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులకు రుణమాఫీ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. రైతుల వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టే జిఓ 22ను వెంటనే రద్దు చేయాలని కోరారు. ఉపాధి హామీ కూలీలకు పది వారాల బకాయిలు పడ్డ వేతనాలను వెంటనే చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల రైతు సంఘం నాయకులు సత్యనారాయణ పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న రైతు, వ్యకాస నాయకులు

కె.కోటపాడు : రైతులు, కౌలు రైతుల, వ్యవసాయ కూలీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ మండలంలోని చౌడువాడ, గుల్లేపల్లి, గొండుపాలెం, కె.కోటపాడు, ఎ.కోడూరు, వారాడ, వి.సంతపాలెం తదితర గ్రామాల్లో సచివాలయాల కార్యదర్శులకు ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం వినత పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న, ఏపీ రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయన బాబు మాట్లాడుతూ కౌలు రైతులకు భూ యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా గుర్తింపు కార్డులివ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల మండల కన్వీనర్ ఎర్ర దేముడు, రైతు సంఘం నాయకులు వనం సూర్యనారాయణ, ఈర్లే నాయుడు బాబు పాల్గొన్నారు.



నాక్ బృందానికి నివేదిక ఇస్తున్న కళాశాల అధికారులు

ఎఎంఎఎల్ కళాశాలలో ముగిసిన నాక్ పర్యటన

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక ఏఎంఏఎల్ కళాశాలలో నాక్ బృందం ఈనెల 18, 19 తేదీల్లో నాక బృందం పర్యటించిందని, ఈ మేరకు నివేదికను ఎగ్జిట్ మీటింగ్‌లో సమర్పించడం జరిగిందని ప్రిన్సిపాల్ డాక్టర్ జి. జయ బాబు తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత రెండు రోజులుగా కళాశాలను సందర్శించి ప్రతి డిపార్ట్మెంట్‌ను క్షుణ్ణంగా పరిశీలించారని, మొదటి రోజు కొన్ని పరిశీలనలు పూర్తి అయిన తర్వాత కళాశాల పూర్వ విద్యార్థులతోను, సిబ్బంది తోను సమావేశం ఏర్పాటు, రెండవ రోజు మిగిలిన విభాగాలను సందర్శించి వారి సూచనలు, సలహాలు రిపోర్టును సమర్పించారని తెలిపారు. నాక్ బృందం పరిశీలన పూర్తయిన తర్వాత వారిచ్చిన సమాచారం మేరకు బెంగళూరు ప్రధాన కార్యాలయం వారు ర్యాంకు కేటాయిస్తారన్నారు. నాక్ విషయంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ ప్రిన్సిపల్ ధన్యవాదాలు తెలియజేశారు. నాక్ సిబ్బందిని సత్కరించారు. తగిన సూచనలు సలహాలు అందించిన నక్కపల్లి గవర్నమెంట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివయ్యకి కళాశాల ప్రిన్సిపాల్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

22 నుండి అన్ని పాఠశాలల్లో 'శిక్షా సప్తాహ్'

ప్రజాశక్తి-అనకాపల్లి : కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జాతీయ విద్యావిధానం 2020 ప్రవేశపెట్టి 4వ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 22 నుండి 28 వరకు వారం రోజుల పాటు రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో శిక్షా సప్తాహ్' కార్యక్రమాన్ని నిర్వహించాలని సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు, కార్యక్రమ నోడల్ ఆఫీసర్ బి.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా జరుపుకుంటున్న ఈ వేడుకల నిర్వహణలో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉండాలని ఆకాంక్షించారు. ఇందులో విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానికులు భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమాలకు సంబంధించి కార్య నిర్వహణ, అమలు పరచే విధి విధానాలకు జిల్లా విద్యాశాఖాధికారులకు, సమగ్ర శిక్షా జిల్లా అదనపు ప్రాజెక్టు కో ఆర్డినేటర్లను బాధ్యులుగా గుర్తించామన్నారు.

వంతెనలను పరిశీలించిన డిపిఒ

ప్రజాశక్తి - వడ్డాది : గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో మండలంలోని ప్రమాదకరంగా ఉన్న వంతెనలను జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి శనివారం పరిశీలించారు. వడ్డాది వద్ద పెద్దేరు నది, విజయరామరాజుపేట తాచేరు, బొడ్డేరు నదులలో వరద నీరు చేరుతుండడంతో అవి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కోనాం రిజర్వాయర్ నీరు విడుదల చేయడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. వడ్డాది విజయరామరాజుపేట వంతెనలు శిథిలం కావడంతో తాత్కాలికంగా నిర్మించిన కాజ్వేలను శనివారం డిపిఒ శిరీష రాణి పరిశీలించారు. నీరు ఉధృతం తగ్గే వరకు భారీ వాహనాలు నిషేధించాలని ఆదేశించారు. వర్షాలు కారణంగా రోడ్లన్నీ చిందరవందరగా మారాయి. బిఎన్ రోడ్లో గోతులు చెరువులను తలపిస్తున్నాయి. ప్రయాణాలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నదులు కాలువలు చెరువులు పొంగి ప్రవహిస్తున్నాయి. డిపిఒ వెంట పంచాయతీ ఈవో లోవరాజు తదితరులున్నారు.



వడ్డాది వద్ద బ్రిడ్జిని పరిశీలిస్తున్న డిపిఒ శిరీషారాణి



విద్యార్థులకు డిగ్రీ పట్టాలు ప్రదానం చేస్తున్న అతిథులు

ఘనంగా ఐఐపిఇ 4వ వార్షిక స్నాతకోత్సవం

ప్రజాశక్తి-సబ్బవరం

భారతీయ పెట్రోలియం, శక్తి సంస్థ (ఐ.ఐ.పి.ఈ.) విశాఖపట్నం 4వ వార్షిక స్నాతకోత్సవం విశాఖపట్నంలోని వరుణ్ బీచ్ లోని హోటల్ నోవోటెల్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. విశాఖపట్నంలోని సిఎస్ఐఆర్ - ఎన్ఐఓ రీజనల్ సెంటర్ చీఫ్ సైంటిస్ట్ ప్రొఫెసర్ వివిఎస్ఎస్.శర్మ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. గ్లోబల్ వార్మింగ్‌ను తగ్గించేందుకు, వాతావరణ మార్పుల కోసం ఇంధన రంగాల్లో వినూత్న మార్గాలను అన్వేషించాలని, లేనిపక్షంలో భవిష్యత్ తరాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. ఇంధన రంగంలో నైతిక పద్ధతులు బాధ్యతలను ఆయన నొక్కిచెప్పారు. ఇది మిలియన్ల మంది జీవితాలను ప్రభావితం చేస్తుందని, పర్యావరణంపై దీర్ఘకాలిక పరిణామాలను కలిగిస్తుందని పేర్కొన్నారు. ఐఐపిఈ డైరెక్టర్ ప్రొఫెసర్ శాలివాహన్ సంస్థ కార్యకలాపాలపై మాట్లాడారు. ప్రస్తుత స్నాతకోత్సవంలో 58 మంది బి.టెక్ విద్యార్థులకు, వీరిలో పెట్రోలియం ఇంజినీరింగ్ నుంచి 26 మంది, కెమికల్ ఇంజినీరింగ్ నుంచి 32 మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. ఒకరు పీహెచ్‌డీ పట్టా కూడా పొందారు.

శవరాజకీయాలు చేస్తున్న జగన్

ప్రజాశక్తి-అనకాపల్లి

రాష్ట్రంలో మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి శవ రాజకీయాలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు ఆరోపించారు. స్థానిక పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రౌడీలను, గూండాలను ప్రోత్సహించి వారి ద్వారా రాజకీయ పబ్బం గడిపేందుకు అలవాటు పడిన జగన్ రెడ్డి శవం ఎక్కడ దొరుకుతుందా అని చూస్తున్నారని విమర్శించారు. టిడిపి ఎప్పుడు ముస్లింల సంక్షేమానికి కట్టుబడి ఉందని, జగన్ రెడ్డి ఉనికిని కాపాడుకోవడానికి శవ రాజకీయాలు చేస్తున్నారని పేర్కొన్నారు. జగన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో జరిగిన హింస, హత్యలు, మానభంగాలు, దోపిడీలు చేశారని ఆరోపించారు. తెలుగుదేశం కార్యకర్తలను వెంటాడి చంపిన రోజులు ఊళ్లకు ఊళ్లో తెలుగుదేశం పార్టీ సానుభూతిపరులను వెంటాడి తరిమివేసిన విషయం గుర్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వేగి వెంకట్రావు, బొడ్డేడ మురళి, మళ్ల గణేష్, శిరం వెంకటలక్ష్మి, పెదపాటి కళ్యాణి, కాండ్రేగుల సత్యనారాయణ, మల్ల శివన్నారాయణ, కుక్కల సత్యవేణి, సారిపల్లి శ్రీనివాసరావు, పెంటకోట రమణ, దాడి వేణు పాల్గొన్నారు.

పునర్నిర్మాణ పనులు వేగవంతం చేయాలి



ఇండోర్ స్టేడియం పునర్నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కొణతాల

ప్రజాశక్తి-అనకాపల్లి

రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియం పునర్నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అనకాపల్లి శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ అధికారులను సూచించారు. శనివారం పట్టణంలోని రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియం, రావుగోపాలరావు కళాక్షేత్రాన్ని పరిశీలించి వాటి పునర్నిర్మాణ పనులపై అధికారులని అడిగి తెలుసుకున్నారు. రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో ఆగస్టు చివరివారంలో రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ జూనియర్ సబ్ జూనియర్ సీనియర్ మహిళలు పురుషులు విభాగాలలో పోటీలు జరగనున్నాయని, ఆ పనులు వేగంగా పూర్తి చేయాలని కోరారు. అనంతరం రామకృష్ణ గారు రావుగోపాలరావు కళాక్షేత్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. విశాఖ మెట్రోపాలిటన్ కమిషనర్ రవీంద్ర, డి ఈ రవి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సింగ్, సీఈ సంజీవ్ తో కూడిన ప్రభుత్వ అధికారుల బృందంతో కళాక్షేత్రంలో పర్యటించి మరమ్మతులు చేసి ప్రజలకి అందుబాటులోకి తీసుకురావడంపై మాజీ శాసనసభ్యులు, అనకాపల్లి తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ పీల గోవింద సత్యనారాయణ తో కలిసి సూచనలు చేశారు. అలాగే స్థానిక దేవునిగుమ్మం వెంకటేశ్వర స్వామిని కొణతాల రామకృష్ణ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెయిట్ లిఫ్టింగ్ అనకాపల్లి జిల్లా కార్యదర్శి గుమ్మాల వెంకటరమ, గుమ్మాల నాగేశ్వరరావు, ప్రసాదల శ్రీను, జనసేన నాయకులు పీల నాగ శ్రీను, వాకాడ బాబు, నల్లల రాజు, మల్ల సురేంద్ర, ఆళ్ల రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుపర్చాలి

ప్రజాశక్తి-చోడవరం

పంచాయతీలో పారిశుధ్యాన్ని ఇంకా మెరుగుపరచాలని, రోడ్లపై చెత్తను ఎప్పటికప్పుడు పంచాయతీ సిబ్బంది తొలగించాలని జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి ఆదేశించారు. చోడవరం గ్రామపంచాయతీలో శనివారం ఆమె పర్యటించారు. చీడికాడ రోడ్డులో గల నరసరా చెరువు, నూకాలమ్మ గుడి ఏరియా, బాలాజీ నగర్, చిన్న బజార్ ఏరియాలలో పరిశీలించారు. తాగునీరు, వీధి దీపాలు, శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. వర్షాలు పడుతున్న కారణంగా రోడ్లకు ఇరువైపులా మొక్కలు విపరీతంగా పెరుగుతున్నాయని వాటిని పూర్తిగా తొలగించాలని సూచించారు. ప్లాస్టిక్ పై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఈవోపీఆర్డీ చైతన్య, పంచాయితీ కార్యనిర్వహణ అధికారి నారాయణరావుకు సూచించారు. అనంతరం తామరచెరువు వీధిలో గల వర్మీ కంపోస్ట్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో డిపిఆర్సి కన్వీనర్ నాగలక్ష్మి, పంచాయతీ మెంబర్ శ్రీనివాస్, చిన్నారావు, ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, కార్తీక్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రైవాడ ఆయకట్టుదారులతో సమావేశం

ప్రజాశక్తి-దేవరాపల్లి

ప్రతి ఏడాది లాగా ఈ ఏడాది ఖరీఫ్ నీరు విడుదలకు ఆగస్టు 2న ఉదయం 10 గంటలకు రైతులతో చర్చించి రైవాడ నీరు విడుదల చేయడం జరుగుతుందని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి అన్నారు. శనివారం రైవాడ అతిథి గృహం వద్ద వారాడ నారాయణమూర్తి రైవాడ రిజర్వాయర్ ప్రాజెక్టు ఆయకట్టుదారుల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాలుగేళ్లలో కాలువలన్నీ పూడిక పోవడంతో అధ్వానంగా ఉన్నాయని, వాటన్నింటినీ పరిశీలించి ప్రభుత్వానికి పంపించడం జరిగిందని చెప్పారు. ఈ సమావేశంలో రైవాడ జలాశయం డి ఈఈ సత్యం నాయుడు, సిబ్బంది, మండల టిడిపి అధ్యక్షుడు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, ఆయకట్టు ప్రతినిధులు రెడ్డి బలరాం, లెక్కల అవతారం, టీడీపీ నాయకులు పోతల పాత్రునాయుడు, కొమర బాబురావు, పెద్దాడ వెంకటరమణ, చల్లా నానాజీ, సోమిరెడ్డి గోవింద, గంధం జగన్ తదితరులు పాల్గొన్నారు



గ్రామస్తులతో డిఎంహెచ్ఒ డాక్టర్ బాలాజీ

భోగాపురంలో డిఎంహెచ్ఒ పర్యటన

ప్రజాశక్తి -అచ్యుతాపురం

మండలంలోని భోగాపురం గ్రామంలో శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బాలాజీ బృందం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తులను పరామర్శించారు. గతంలో చనిపోయిన వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. నీటిలో ఫ్లోరైడ్ ఎక్కువగా ఉండటం వలన 8 మంది కిడ్నీ సంబంధిత వ్యాధితో చనిపోయారని గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన కె.నాగేశ్వరరావు, కేసన్న బాబు, చికిత్స పొందుతున్నారని చెప్పారు. గ్రామంలో ఉన్న అన్ని మంచినీటి వనరులను తనిఖీలు చేశారు. ఫ్లోరైడ్ ఎక్కువగా ఉన్న నీటిని గ్రామస్తులు వినియోగించకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. 12 బోరు బావులు నీటిని, ట్యాంక్ నీటిని విశాఖలో ఉన్న రీజనల్ పబ్లిక్ హెల్త్ లేబరేటరీ పంపిస్తామని చెప్పారు. గ్రామంలో నివసిస్తున్న ప్రజలకు సరిపోయే రీతిలో ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ గారికి రిపోర్ట్ పెడతామన్నారు. కార్యక్రమంలో పిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ శ్రావ్య, జడ్పిటిసి లాలం రాంబాబు, సిహెచ్ఓ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

శివరామకృష్ణకు ఎమ్మెల్యే పంచకర్ల పరామర్శ

ప్రజాశక్తి - పరవాడ : మండలంలోని గ్రేటర్ విశాఖ 79వ వార్డు దేశపాత్రునిపాలెం జనసేన పార్టీ అధ్యక్షులు పిల్లా శివరామకృష్ణకు ఆరోగ్యం బాగులేనందని తెలుసుకున్న వెంటనే శనివారం పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు అతని స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్యం విషయమై క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నరు. ఈ కార్యక్రమంలో ఎన్డిఎ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని ఇరువాడ పంచాయతీ పరిధి కృపా సహకార కేంద్రంలో గ్రేస్ ఆఫ్ గాడ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతినెల నిర్వహిస్తున్న హత్తుకునే చేతులు కార్యక్రమంలో భాగంగా నిరుపేదలకు, వికలాంగులకు, వృద్ధులకు, వితంతువులకు నిత్యవసర సరుకులు, ప్రయాణ ఖర్చులు, అల్పాహారం శనివారం అందించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన విజయ్ భాస్కర్, మౌనిక పాస్టర్ స్టీవెన్ మాట్లాడుతూ సమాజంలో తోటివారికి ప్రేమను అందిస్తూ, ఐకమత్యంగా నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్రదర్ ఇస్సాకు, మాథ్యూ, స్మైలీ, దివ్య తేజ, రమ్య , ప్రేమ రత్నం తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా తోటాడ గిరి ప్రదక్షిణ

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని తోటాడ శ్రీఆదినారాయణస్వామి రాజయోగాశ్రమం ట్రస్ట్ ఆధ్వర్యంలో గురుపూర్ణిమ వేడుకల్లో భాగంగా శనివారం గిరిప్రదక్షిణ నిర్వహించారు. ఓంకార పీఠం నుంచి ప్రారంభమైన ఈ వేడుక త్రిమూర్తుల ఆలయం, మూలపేట, పాటిపల్లి కోలనీ, నారాయుడుపాలెం మీదుగా తిరిగి ఆశ్రమం వరకు కొనసాగింది. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. గురుదేవులు, అమ్మవారి భజన గీతాలతో ప్రదక్షిణ చేపట్టారు. మేనేజింగ్ ట్రస్టీ సూరిశెట్టి సుషుమ్న కుమార్ పర్యవేక్షణలో ఆరు కిలో మీటర్ల మేర ఈ కార్యక్రమం కొనసాగింది. ఆదివారం ఓంకార పీఠంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు.



గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

భూ కబ్జాలు, అక్రమ క్వారీలను తొలగించండి

మండల పరిషత్తు సమావేశంలో ఎమ్మెల్యే పంచకర్ల

ప్రజాశక్తి- సబ్బవరం

మండలంలోని ప్రభుత్వ భూముల భూకబ్జాలు, అక్రమ గ్రావెల్ క్వారీలు ఎక్కడ ఉన్నా తక్షణమే తొలగించాలని స్థానిక రెవెన్యూ అధికారులను ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని, శాఖల వారీగా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఆక్రమణకు గురైన, అన్యాయంగా పేదల నుండి లాక్కున్న, రికార్డులను ట్యాంపరింగ్ చేసిన గెడ్డవాగులు, కొండ పోరంబోకులు, చెరువులులకు సంబంధించి ప్రభుత్వ భూములను వెంటనే స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. వర్షాకాలం కావడంతో గ్రామాల్లో డెంగ్యూ, మలేరియా, డయేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, తక్షణమే వైద్య సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. సబ్బవరం డిగ్రీ కాలేజ్ స్థలాన్ని కొంతమంది దురాక్రమం చేశారని నారపాడు సర్పంచ్ మామిడి శంకర్రావు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆక్రమణలను వెంటనే తొలగించి సరిహద్దులు గుర్తించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. సబ్బవరం సర్వేనెంబర్ 255లో డంపింగ్ యార్డ్‌ని తొలగించాలని సర్పంచ్ డి.ప్రసాదరావు కోరగా డంపింగ్ యార్డ్‌కు అనుకూలమైన స్థల సేకరణ చేయాలని కోరారు. నారపాడు పంచాయతీలో భూ రీసర్వేలో సరిగా రైతుల భూముల వివరాలు నమోదు చేయలేదని కోఆప్షన్ సభ్యుడు గొర్లి నూకరాజు తెలిపారు. పైడివాడ అగ్రహారంలో ల్యాండ్ పూలింగ్‌కు భూములు ఇచ్చిన రైతులకు పరిహార భూములు ఇచ్చారా? లేదా? అని ఎంపీటీసీ శీరం అప్పలరాజు ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, ఎంపీడీవో ఎస్. రామ్మోహన్ రావు, షేక్ బాబురావు, వైస్ ఎంపీపీలు శరగడం ఝాన్సీలక్ష్మీరాణి, చొక్కాకుల గోవింద, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

మెరుగైన వైద్య సేవలు అందించాలి



వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

ప్రజాశక్తి- కె.కోటపాడు

దూర ప్రాంతాల నుండి వచ్చే రోగులకు అసౌకర్యం కలిగించకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి వైద్యులను కోరారు. శనివారం స్థానిక 50 పడకల వైద్య విధాన పరిషత్ ఆసుపత్రిని ఆయన సందర్శించారు. ఆసుపత్రిలో ఉన్న అన్ని విభాగాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రోగులను అడిగి ఆసుపత్రి సౌకర్యాలపై ఆరా తీశారు. ఆసుపత్రిలో ప్రసవాలు ఎక్కువగా జరుగుతుండటంపై ఆనందం వ్యక్తం చేశారు. కొన్ని రకాల వైద్య పరికరాలు లేకపోవడంతో సీరియస్ కేసులను ఇతర ఆసుపత్రులకు రిఫర్ చేయడంపై కొంత అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వైద్యుల సమావేశంలో మాట్లాడుతూ ఆసుపత్రికి కావలసిన మౌలిక సదుపాయాలు కల్పించే బాధ్యత తనకు వదిలివేయాలని సూచించారు. రోజురోజుకు ఓపి సేవలు పెరుగుతున్న దృష్ట్యా అదనపు సిబ్బందిని తాత్కాలికంగా నియమించేందుకు అనుమతులు కోరనున్నట్లు చెప్పారు. కార్యక్రమంతో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీలక్ష్మి, వైద్యులు నందకిషోర్, సునీల్, కోటేశ్వరరావు, వైదేహి, రమ, సుమన్ లత, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, టిడిపి మండల అధ్యక్షుడు రొంగలి మహేష్, నాయకులు కన్నూరు సూర్యనారాయణ, పూడి నారాయణమూర్తి, చౌడువాడ సర్పంచ్ దాడి ఎరుకనాయుడు, డోకల నరసింహమూర్తి, సబ్బవరపు రామనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వరి నారు మడుల పరిశీలన

ప్రజాశక్తి -కశింకోట : కశింకోట మండల వ్యవసాయ అధికారి స్వప్న శనివారం మండలంలోని వెదురుపర్తి గ్రామంలో వర్షాలు కారణంగా నీట మునిగిన వరి నారుమడులను పరిశీలించారు. వివిధ స్థాయిల్లో నర్సరీలను, ఇనుము లోపాన్ని గమనించారు. కొంత మేరకు ముంపునకు గురైన నారుమడులలో ఉన్న అదనపు నీటిని రైతులు తీసివేసి, 5 సెంట్ల నర్సరీకి అన్నబేధీ, నిమ్మ ఉప్పు పిచికారీ చేసి తర్వాత యూరియా 1 కేజీ మరియు ఎంఓపీ 1 కేజీని పిచికారీ చేయాలని సూచించారు. ఆమె వెంట సిబ్బంది ఉన్నారు.

జీతాలు చెల్లించాలని వాలంటీర్ల వినతి

ప్రజాశక్తి- అనకాపల్లి : వాలంటీర్లకు జీతాలు చెల్లించి ఆదుకోవాలని కోరుతూ శనివారం తుమ్మపాల గ్రామపంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఈశ్వరరావుకు వాలంటీర్లు శనివారం వినతి పత్రం అందజేశారు. ఇటీవల వాలంటీర్ల పేపర్ బిల్లులు మినహా మిగిలిన గౌరవ వేతనాలు చెల్లించేందుకు జీవో జారీ చేశారని, ఆ మేరకు గౌరవ వేతనాలు విడుదల చేయాలని కోరారు. దీనిపై ఈవో ఈశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వానికి ఈ విషయాన్ని తెలియపరుస్తామన్నారు.

తుమ్మపాలలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని తుమ్మపాల గ్రామంలో వీధులతోపాటు ప్రధాన రహదారిలో శనివారంపారిశుధ్య మెరుగుకు చర్యలు తీసుకుంటున్నారు. ఎంపీడీవో, ఈఓఆర్డి ఆదేశాల మేరకు ఈవో ఈశ్వరరావు గ్రామంలో డ్రైనేజీలు శుభ్రపరచడం, చెత్తను తొలగించడం చేస్తున్నారు. వర్షాలు వస్తున్న నేపథ్యంలో అంటు వ్యాధులు ప్రభలకుండా వీధుల్లో బ్లీచింగ్ చల్లడం చేస్తున్నారు.

22న ఆర్లి దేవస్థానం భూములకు కౌలు వేలం

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని ఆర్లి గ్రామంలో ఉన్న శ్రీమల్లికార్జున స్వామి దేవాలయం భూములకు ఈ నెల 22వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు దేవస్థానం ఆవరణలో కౌలు వేలం నిర్వహిస్తున్నట్లు దేవాదాయ శాఖ కార్యనిర్వహణ అధికారి శర్మ తెలిపారు. స్వయంభు దేవాలయానికి సంబంధించి 11 ఎకరాల భూమి కౌలుకు ఈ వేలం నిర్వహిస్తున్నట్లు ఔత్సాహికులు అందరూ వేలంపాటలో పాల్గొనాలని శర్మ కోరారు.

అలమండలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ పర్యటన

ప్రజాశక్తి -దేవరాపల్లి : మండలంలోని ఎం.అలమండ గ్రామాన్ని ఇంచార్జ్ ఎంపీడీవో ఎస్ అప్పలరాజు శనివారం సందర్శించారు. గ్రామంలో ఉన్న వీధులను డ్రైనేజీ, వాటర్ ట్యాంక్, శానిటేషన్‌ను పరిశీలించారు. శానిటేషన్‌పై దృష్టి సారించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి గ్రామంలోని సూరిశెట్టి అప్పారావు ఇంటి ముందు పోర్టుకో స్లాబ్ కూలింది. ఎవరికీ ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని వేరే చోటికి తరలించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. అనంతరం అంగన్వాడి కేంద్రాలను పరిశీలించి చిన్నారులకు మంచి పౌష్టికాహారం అందించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ దాడి జగన్, మాజీ జెడ్పిటిసి పోతల పాత్రునాయుడు, ఇన్చార్జి ఈవోపీఆర్డి సంతోష్ నలిని, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కాలువల్లో పూడికతీత

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి- కె.కోటపాడు

కె.కోటపాడు మండల కేంద్రంలోని మురికి కాలువల్లో పూడిక తీర పనులు శనివారం చేపట్టారు. 'పొంగి ప్రవహిస్తున్న మురుగునీటి కాలువ' శీర్షిక ప్రజాశక్తి శనివారం ప్రచురించిన వార్తకు కె.కోటపాడు పంచాయతీ కార్యదర్శి ప్రసాదు, పంచాయతీ విస్తరణ అధికారి పివిఎస్.ప్రసాదు స్పందించారు. వెంటనే కాలువలు పూడిక తీసే కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానిక దిగువ యాతపేట వద్ద గల కాలువలో చిన్నపాటి పైపులు వేసినందున వర్షాలు పడినప్పుడు ఆ పైపులకు అడ్డంగా చెత్త చెదారం పేరుకుపోవడంతో కాలువలు మూసుకుపోయాయి. దీంతో వర్షం నీరుతో పాటు కాలులో ఉన్న మురికి నీరు రోడ్లపై ప్రవహించి ఇండ్లలోకి మురికి నీరు రావడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. దీనిపై ప్రజాశక్తి వార్త ప్రచురించింది. కాలువలో పూడుక తీసినందుకు దిగువ యాతపేట ప్రజలతోపాటు చుట్టుపక్కల ఉన్న ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

సమగ్ర అసంక్రమిత వ్యాధులపై ముగిసిన శిక్షణ

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక ఎన్టీఆర్ జిల్లా వైద్యాలయంలో నెలరోజుల పాటు పిహెచ్సి వైద్యాధికారులు, సిహెచ్ఓలు, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలకు సమగ్ర అసంక్రమిత వ్యాధులపై ఇచ్చిన శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. నేషనల్ హెల్త్ మిషన్ సౌజన్యంతో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ నిర్వహించిన ఈ శిక్షణలో రిసోర్స్ పర్సన్స్ గా నేషనల్ హెల్త్ మిషన్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ లూసీ, ఎన్ సి డి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ ఎస్తేరు రాణి, డాక్టర్ జ్యోత్స్న, డాక్టర్ భాను పాల్గొని క్యాన్సర్‌లో రకాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరీక్షలు చేయు విధానం గురించి వివరించారు. అలాగే అధిక రక్తపోటు మధుమేహం వంటి వ్యాధుల పట్ల తీసుకోవలసిన చర్యలను వివరించారు.

ఘనంగా తాతీలునాయుడు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- కశింకోట : తెలుగు యువత మండల ఉపాధ్యక్షులు అనాల తాతీలునాయుడు జన్మదినం వేడుకలు శనివారం చింతలపాలెంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ తాతీలునాయుడుని శాలువతో ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు కాయల మురళి, మజ్జి నిరంజన్ కుమార్, సిదిరెడ్డి సూర్య నారాయణ, ఎంపీటీసీ బుదిరెడ్డి అప్పుడు, జెర్రపోతల నూకి నాయడు, కోన సురేష్ కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి రాష్ట్ర నేత రత్నాకర్

కుండపోత వాన

గెడ్డలు, పొలాలు జలమయం



కోటవురట్ల పందూరు వంతెన పైనుంచి ప్రవహిస్తున్న నీరు

ప్రజాశక్తి -కోటవురట్ల: మండల వ్యాప్తంగా శుక్రవారం ఉదయం నుంచి శనివారం తెల్లవారుజాము వరకు ఎడ తెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో జనజీవనం స్తంభించడంతో పాటు, రైతులు, వ్యాపారులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.వర్షానికి వరి నారుమడుల్లో నీరు చేరడం పట్ల రైతులు ఆనందం వ్యక్తం చేశారు. మండల వ్యాప్తంగా అల్పపీడన ప్రభావంతో ఇంతవరకు 99.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయినట్లు తహసిల్దార్ వెంకటరమణ తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకున్నా పరిష్కరించేందుకు రెవెన్యూ అధికారులను అందు బాటులో ఉంచి అప్రమత్తం చేసినట్లు ఆయన తెలిపారు.

గొలుగొండ : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలో రోడ్లు అధ్వానంగా మారాయి. వర్షాలతో బోడ్డేరు గెడ్డ, ధారగెడ్డ, చీడిగుమ్మల వద్ద వరహా గెడ్డ, వాగులు, చెరువులు నీటితో కళకళలాడుతున్నాయి. ఇప్పటికే వర్షంతో రైతులు వ్యవసాయపనుల్లో నిమగ్నమయ్యారు. ఎ.ఎల్ పురం, లింగంపేట, కృష్ణాదేవిపేట, గొలుగొండ తదితర గ్రామాల్లో ప్రధాన రహదారుల్లో ఉన్న భారీ గోతుల్లో వర్షం నీరు చేరి రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏ.ఎల్ పురం ఆర్టీసీ బస్ స్టేషన్ ఆవరణ వర్షం నీటితో నిండి చెరువును తలపిస్తోంది. రావణాపల్లి గ్రామంలో దేవర అప్పలనాయుడు ఇంటి ప్రహరీగోడ వర్షాలకు కూలిపోయింది. మార్కెట్ పక్క రోడ్డు ఆనుకుని కొండ పై ఉన్న అప్పలనాయుడు ఇల్లు మూడు రోజులు గా కురుస్తున్న వర్షాలకు శుక్రవారం రాత్రి గోడ కూలిపోయింది.

బుచ్చయ్యపేట : అల్పపీడన ప్రభావంతో మండలంలోని పలు గ్రామాల్లో శనివారం భారీగా వర్షం కురిసింది. ఉదయం నుండి మధ్యాహ్నం వరకు వర్షం పడడంతో పలు గ్రామాల్లో గల పంట పొలాల్లో వర్షపు నీరు భారీగా చేరింది.



గొలుగొండలో కురుస్తున్న వర్షం



జలాశయంలో నీరు

తాండవ కళకళ

ప్రజాశక్తి -నాతవరం: మండలంలో తాండవ రిజర్వాయర్‌కు వరద నీరు చేరుతుంది. గత సంవత్సరం సీజన్ అనంతరం భారీగా నీటిమట్టం పడిపోయింది. తాండవ రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 380 అడుగులు కాగా గత సంవత్సరం సీజన్ అనంతరం 355 అడుగులకు పడిపోవడంతో ఈ సంవత్సరం రైతులు పంటకు నీరు సరిపోతుందా అని చాలా ఆందోళన చెందారు. కురుస్తున్న వర్షాలు కారణంగా పెరుగుతున్న నీటిమట్టంతో రైతులలో ఆనందం చిగురించింది. ప్రస్తుతం నీటిమట్టం 366 అడుగులకు పెరిగింది. కురుస్తున్న వర్షాలకు మరింత పెరిగే అవకాశం ఉందని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు

నీట మునిగిన వరినారు మళ్లు

పద్మనాభం : పద్మనాభం మండలంలోని వికె.పాలెం, బాంధేవపురం, పొట్నూరులో వరి నారుమళ్లు పూర్తిగా నీట మునిగాయి. ఆకు కుళ్లిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. విశాఖ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అప్పలస్వామి మండలంలోని పాండ్రంగి, అనంతవరం, మద్ది గ్రామాల్లో శనివారం పర్యటించినా, లోటట్టు ప్రాంతాల్లో కాకుండా మెట్టు ప్రాంతాల్లో పర్యటించడం వల్ల మునిగిన నారుమళ్లు వారికి కనిపించలేదని రైతులు చెబుతున్నారు.



మునిగిన పొలాలు

అస్తవ్యస్తంగా రహదారులు

ప్రజాశక్తి -కొత్తకోట:భీమునిపట్నం- నర్సీపట్నం (బి ఎన్)రోడ్డు లో ప్రయాణించాలంటే నరకం చూడాల్సి వస్తోందని పలువురు వాహన చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అల్లూరి జిల్లా పాడేరు, అరకుతో పాటు అనకాపల్లి, విశాఖపట్నం ఉమ్మడి జిల్లాలలో పలు ముఖ్య పట్టణాలను కలుపుకు పోయే ఈ రోడ్డు గత అయిదేళ్ళ గా శిధిలావస్థలోనే ఉంది. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చోడవరం నుంచి నర్సీపట్నం వచ్చే రోడ్ మార్గంలో రోలుగుంట మండలం ఎలెంకాయల పాలెం, రోలుగుంట, బోగాపురం, రావికమతం మండలం కొత్తకోట జిల్లా పరిషత్ పాఠశాల, దొండపూడి, మేడివాడ, గర్ణికంతో పాటు బుచ్చెయ్య పేట మండలం కోమల్లపూడి, పొట్టిదొరపాలెం, తదితర గ్రామాలలో పెద్ద పెద్ద గోతులు పడి చెరువుని తలపిస్తున్నాయి. ఈ గోతిల్లో ప్రమాదవ శాత్తు వాహనాలు బోల్తా పడి పలువురు వాహన చోదకులు గాయాల పాలవుతున్నారు.

గత వైసీపీ ప్రభుత్వంలో ఈ రోడ్డు మరమ్మతుల కోసం సుమారు రూ 100 కోట్లకు పైగా నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో కొన్ని చోట్ల రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. మరికొన్ని చోట్ల రోడ్డు వేయకుండా అలా వదిలే సారు. దీంతో ఆయా గ్రామాల వద్ద మరింత గోతులుగా మారి ప్రమాదాలను తలపి స్తున్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి గోతులు పూడ్చే విధంగా చర్యలు తీసుకోవాలని వాహన చోదకులు కోరుతున్నారు.



రహదారి గోతిలో చేరిన వర్షపు నీరు



టీకాలు వేస్తున్న వైద్యులు

మూగజీవాలకు టీకాలు

ప్రజాశక్తి-మాడుగుల:మండలంలోని పలు గ్రామాలలో లంపీ స్కిన్ వ్యాధి నిరోధక టీకాలను వేస్తున్నట్లు మాడుగుల ఏరియా పశు వైద్యశాల సహాయ సంచాలకులు చిట్టి నాయుడు తెలిపారు. మాడుగులలో చిట్టి నాయుడు టీకాలను స్వయంగా పరిశీలించారు. మాడుగుల ఏరియా పశు వైద్య శాల పరిధిలోని చీడికాడ మండలానికి 5,000 డోసులు, మాడుగుల మండలానికి 7,300 డోసులు పంపిణీకి సిద్ధంగా వున్నట్లు తెలిపారు. పాడి రైతులు తమ గ్రామాలలోని రైతు సేవా కేంద్రంలో ఉండే పశు వైద్య సహాయకుని సంప్రదించి 4 నెలలు వయసు దాటిన ఆడ, మగ తెలుపు జాతి పశువులన్నింటికి ఈ టీకాలు వేయించుకోవాలని ఆయన తెలిపారు. పాడి రైతులు వ్యాధి సోకిన పశువును కడగ రాదని, మిగిలిన పశువులనుండి వ్యాధి సోకిన పశువును వేరుగా ఉంచాలని తెలిపారు. పశు వులకు దద్దుర్లు, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గరలోని పశు వైద్యాధికారులను సంప్రదించి వైద్యం అందించాలని సూచించారు.



పాస్‌లు ఇస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయులు

విభిన్న ప్రతిభావంతులకు ఉచిత బస్‌పాస్‌ల పంపిణీ

ప్రజాశక్తి- కొత్తకోట: రావికమతం భవితా కేంద్రంలో 55 మంది విభిన్న ప్రతిభావంత విద్యార్థులకు ఉచిత బస్ పాసులను మండల వికలాంగుల సంక్షేమ శాఖ అధ్యక్షులు ఏఆర్ జే.నర్సింగరావు, మేడివాడ స్కూల్ అసిస్టెంట్ ప్రత్యేక ఉపాధ్యాయులు బి.మహాలక్ష్మి నాయుడు, భవితా కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయులు జగన్నాథ నాయుడు చేతుల మీదుగా అందజేశారు. మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రత్యేక ఉపాధ్యాయుడు మహాలక్ష్మి నాయుడు మాట్లాడుతూ, ఈ నెల 15వ తేదీన మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అనకాపల్లి ఆర్టీసీ అధికారులు ప్రత్యేక క్యాంపు నిర్వహించి, వారిలో 55 మంది దివ్యాంగులకు బస్సు పాసులు మంజూరు చేశారని, ఇవి మూడు సంవత్సరాల వరకు ఉచితంగా ప్రయాణం చేయడానికి పని చేస్తాయన్నారు. మండలంలో వున్న బుద్ధిమాంద్యం గల దివ్యాంగ విద్యార్థులకు బోధనోపకరణ సామాగ్రి ఉచితంగా పొందడానికి జాతీయ సాధికారిక సంస్థకు 25 అప్లికేషన్ లు పంపించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, మండల విద్యాశాఖ డేటా ఎంట్రీ ఆపరేటర్ శ్రీదేవి పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న ధర్మశ్రీ

మాజీ ఎమ్మెల్యే ధర్మశ్రీ పరామర్శ

ప్రజాశక్తి-రోలుగుంట:మండల కేంద్రానికి చెందిన మద్దు సత్యనారాయణ(గిరమ్మ సత్యం) ఇటీవల మరణించంతో ఆయన కుటుంబ సభ్యులను శనివారం మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పరామర్శించారు. గిరమ్మ సత్యం మరణం కుటుంబానికే కాకుండా వైసీపీకి తీవ్ర నష్టమని ధర్మశ్రీ ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యుత్ సమస్యలపై వాట్సాప్ చేయండి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:మీ ప్రాంతంలో విద్యుత్ సమస్యలు ఉంటే వెంటనే సంబంధిత సమస్యపై వాట్సాప్‌కు సమాచారం ఇవ్వాలని ఏపీఈ పీడీసీఎల్ నర్సీపట్నం డివిజనల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సత్యానందం తెలిపారు. ఏపీఈపీడీసీఎల్ అధికారులు ఇందుకోసం వాట్సాప్ నెంబర్ కేటాయించారన్నారు. విద్యుత్ సమస్యలపై ఈ నెంబర్ కు వాట్సాప్ ద్వారా తెలియజేస్తే తక్షణం స్పందించి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. విద్యుత్ సమస్యపై వాట్సాప్ నెంబర్ 7382249881 ఎస్ఈ (ఆపరేషన్స్) తెలియజేయాలని కోరారు. భారీవర్షాల నేపథ్యంలో విద్యుత్ శాఖ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నర్సీపట్నం డివిజన్ కంట్రోల్ రూమ్ లో ఉన్న ఫోన్ నెంబర్ 9491030714కు సమా చారం తెలియచేయాలని వెల్లడించారు.

నారు మడుల సంరక్షణపై శ్రద్ధ చూపాలి



నక్కపల్లిలో అవగాహన కల్పిస్తున్న ఎఒ

ప్రజాశక్తి- నక్కపల్లి:వరి నారుమడుల్లో రైతులు సస్య రక్షణ యాజమాన్య చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ సూచించారు. మండలంలోని శనివారం ఉపమాక పంచాయతీ శివారు మనబాలవానిపాలెం, దేవవరం, దొండాడ, గుల్లిపాడు గ్రామాల్లో క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా వ్యవసాయ సిబ్బందితో కలిసి నారుమడులను పరిశీలించారు. పొలాల్లో నిల్వ ఉన్న వర్షపు నీటిని బయటకు తొలగించాలని రైతులకు సూచించారు. వర్షాలు కురవడంతో వాతావరణం చల్లగానూ, ఆకాశం మేఘావృతమై ఉండడంతో వరి నారుకు పొడ తెగులు ఆశించే అవకాశం ఉందని, ఎక్కడైనా నారు చనిపోతున్నట్లు , ఎండుతున్నట్లు కనిపిస్తే వెంటనే హెక్సాకొనజోల్ మందు ఒకసారి పిచికారి చేయాలని సూచించారు. నీట మునిగిన నారుమడి ఉన్నట్లయితే నీరు తొలగిపోగానే రెండు కిలోల యూరియా, కేజీ పొటాష్ ఎరువులను ఐదు సెంట్ల నారుమడిలో చల్లాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సత్యనారాయణ, ఆయా గ్రామాల వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు .

నర్సీపట్నం టౌన్:మండలంలోని గబ్బాడలో రైతు సేవా కేంద్రం పరిధిలోని వరి నారుమడులను శనివారం నర్సీపట్నం వ్యవసాయ సహాయ సంచాలకులు టి.శ్రీదేవి పరిశీలించారు. వర్షాలకు నారుమడులలో చేరిన నీటిని వీలైనంత త్వరగా బయటికి పోయేలా కాలువలు తీసుకోవాలని రైతులకు సూచించారు. రెండు మూడు రోజుల కన్నా ఎక్కువగా నీటిలో మునిగి ఉంటే నారు దెబ్బతినే అవకాశం ఉందన్నారు. ఆ పరిస్థితి రాకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి డి.అప్పారావు, ఏఈఓ శ్రీహరి, గబ్బాడ వ్యవసాయ సహాయకులు వెంకటరమణ పాల్గొన్నారు.

వి సెజ్‌లో రికార్డు స్థాయి ఎగుమతులు

● గతం కంటే 18 శాతం అదనం



వి సెజ్
జోనల్ డెవలప్‌మెంట్ కమిషనర్
శ్రీనివాస్ ముప్పాల

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం స్పెషల్ ఎకనామిక్ జోన్ (దువ్వాడ) 2024-25 ఏప్రిల్-జూన్ మొదటి త్రైమాసికంలో రూ.62,198 కోట్ల ఎగుమతులను నమోదు చేసిందని విశాఖపట్నం స్పెషల్ ఎకనామిక్ జోన్ జోనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ శ్రీనివాస్ ముప్పాల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇది మునుపటి సంవత్సరం 2023-24 కంటే 18 శాతం ఎక్కువ అని పేర్కొన్నారు. అందులో సేవల ఎగుమతులు రూ.37,758 కోట్లు కాగా, సరుకుల ఎగుమతులు రూ.24,439 కోట్లుగా నమోదయ్యాయని తెలిపారు. సరుకుల ఎగుమతులు మునుపటి సంవత్సరంతో పోలిస్తే 72 శాతం పెరిగాయని .వెల్లడించారు. ఈ త్రైమాసికంలో మూడు కొత్త ఎస్ఇజెడ్ యూనిట్ ప్రతిపాదనలు, రెండు ఇఒయు ప్రతిపాదనలు ఆమోదించబడ్డాయని పేర్కొన్నారు. అంతేకాకుండా విఎస్ఇజెడ్ రూ.1, 12,276 కోట్ల పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు 2024 మార్చి 31 నాటికి 6,18,551 మందికి ఉపాధిని కల్పించిందని తెలిపారు. మొదటి త్రైమాసికంలో (ఏప్రిల్ - జూన్ 2024) తెలంగాణ రాష్ట్రంలో ఒక కొత్త సెజ్ యూనిట్, 2 కొత్త ఇఒయు ప్రతిపాదనలు, ఆంధ్రప్రదేశ్‌లో 2 కొత్త ఎస్ఇజెడ్ యూనిట్ ప్రతిపాదనలు ఆమోదం పొందాయని ఆయన తెలియజేశారు. కొత్తగా ఆమోదించబడిన ఎస్ఇజెడ్ ఇఒయు యూనిట్లు రూ.97.24 కోట్ల పెట్టుబడి పెట్టి 1500 మందికి ఉపాధిని కల్పిస్తాయని తెలిపారు.

పలు సంస్థల ట్రేడింగ్ కార్యక్రమాలు

విశాఖపట్నం స్పెషల్ ఎకనామిక్ జోన్‌లో ట్రేడింగ్ కార్యకలాపాలను చేపట్టడానికి ఆంధ్రప్రదేశ్‌లో మినరల్స్, యుపి ప్రో ఇన్వెంటరీ ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు ఆమోదం పొందగా, ప్రాసెసింగ్ కోసం.. ఎం/ఎస్.ఇన్ఫినిటి మినరల్స్ అండ్ అబ్రసివేస్ ఎల్ఎల్‌పికి రెండు కొత్త సెజ్ యూనిట్ల ప్రతిపాదనలు ఆమోదం పొందాయని తెలిపారు. అదేవిధంగా తెలంగాణలో ఒక కొత్త సెజ్ యూనిట్ జెడ్ఎఫ్ పాసివ్ సేఫ్టీ సిస్టమ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఐటి సేవలను అందించేందుకు ఆమోదం లభించిందని తెలిపారు. బల్క్ డ్రగ్స్ కోసం కోసం రెండు కొత్త ఇఒయులు ఎంఎస్ గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్, రిస్టా ఫార్మా ప్రైవేట్ ఫార్మాస్యూటికల్స్ సంస్థల ప్రతిపాదనలు ఆమోదం పొందాయని తెలిపారు.



పరిశీలిస్తున్న ఎంపిడిఒ

ముంపు ప్రాంతాల పరిశీలన

ప్రజాశక్తి -నాతవరం:తుఫాను సమయాల్లో వర్షాలు అధికంగా కురిసినప్పుడు మండలంలోని లోతట్టు గ్రామమైన వైబి అగ్రహారంను మండల పరిషత్ అభివృద్ధి అధికారి జే.రాంబాబు, పంచాయతీ కార్యదర్శి హుస్సేన్ పరిశీలించారు. వైబి అగ్రహారం, కాకినాడ జిల్లా సరిహద్దు ఉప్పరి గూడెం వద్ద, తుని -నర్సీపట్నం ప్రధాన రహదారిలో ఉన్న వంతెనను పరిశీలించారు. వర్షాలు అధికంగా కురిస్తే తుని -నర్సీపట్నం రహదారిలో రవాణా సౌకర్యం వంతెన వద్ద కష్టంగా ఉండవచ్చని తెలియజేశారు వాతావరణం మార్పుల దృష్ట్యా గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. డ్రైనేజీలు శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైబిఅగ్రహారం గ్రామ సర్పంచ్ కోసూరు విజయ పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న అప్పలరాజు, నాయకులు

ఉపాధి హామీ బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:ఉపాధి హామీ కూలీలకు బకాయిలు చెల్లించాలని, రైతులకు పెట్టుబడి సాయం అందించాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం అప్పలరాజు కోరారు. మండలంలోని శనివారం దోనివానిలక్ష్మీపురం, వేంపాడు గ్రామ సచివాలయాల అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, వ్యవసాయ కూలీలకు నెలల తరబడి కూలీ బకాయిలు చెల్లించక పోవడంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవు తున్నారని, పస్తులతో జీవిస్తున్నారని వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి ఉపాధి కూలీ బకాయిలు చెల్లింపులకు చర్యలు చేపట్టాలన్నారు.సంవత్సరానికి 200 రోజులు పని దినాలు కల్పించాలని, రోజు కు 600 రూపాయలు వేతనం చెల్లించాలని కోరారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం కింద సంవత్సరానికి 20 వేల రూపాయలు అందిస్తామని ప్రకటించారని, ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో వెంటనే అన్నదాత సుఖీభవ పథకం అమలులో కి తీసుకొని వచ్చి ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ ఎం.రాజేష్, నాయకులు వై.నవీన్, పి.శ్రీనివాసరావు, ఎం.బాబ్జీ, వై.అప్పారావు పాల్గొన్నారు.

చీడికాడ: కౌలు రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలని, ఉపాధి హామీ బకాయిలు వెంటనే చెల్లించాలని ప్రజా సంఘాల అద్వర్యంలో శనివారం పలు సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శులకు వినతిపత్రాలు సమర్పించారు. అనంతరం సిఐటియు మండల కార్యదర్శి ఆర్.దేముడునాయుడు మాట్లాడుతూ, వ్యవసాయ ఖరీఫ్ సీజన్‌కు ప్రభుత్వం రైతులకు వ్యవసాయ పెట్టుబడులు సాయం నిమిత్తం ఇస్తామన్న 20 వేలు వెంటనే అందించాలని కోరారు. రైతాంగాన్ని అప్పుల నుండి కాపాడాలని తెలిపారు. జీవో 22 ను వెంటనే రద్దు చేయాలి.డిమాండ్ చేసారు.కౌలు రైతులకు గుర్తింపు కార్డులకు భూయజమాని సంతకం తప్పనిసరి చేశారని, దీంతో కార్డులు అందక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. భూ యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా ప్రభుత్వం కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, కూలీలు పల్గొన్నారు.

ముసురుతో ముసలం

-వర్షాలతో పొంగిపొర్లి ప్రవహిస్తున్న డ్రెయినేజీలు
-ఎక్కడ చూసినా దుర్గంధభరితం-నిలిచిన మురుగునీరు
-ఇదీ నర్సీపట్నంలోని పలు వీధుల దుస్థితి



ధనిమిరెడ్డి వీధి సమీపంలో రోడ్డుపై నిలిచిన మురుగునీరు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పట్టణ పురవీధుల్లో చెత్త పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. వ్యర్థాలన్నీ రహదారుల పైకి చేరడంతో పట్టణ ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. కురిసిన వర్షానికి ఆర్టీసీ ఇన్ గేటు నుంచి శ్రీకన్య దిగువ వరకు కాలువల్లోని మురుగు నీరంతా రోడ్లపైకి ప్రవహించింది. శివపురం వద్ద చెత్త పేరుకు పోయి గుట్టలుగా పడి వున్నాయి. వ్యర్థాలన్నీ రోడ్లపై ఉండి పోవడంతో పరిసరాలన్నీ అధ్వానంగా మారాయి. వీటిని తొలగించేందుకు పూర్తి స్థాయిలో పారిశు ధ్య సిబ్బంది లేరు. తొలగించాలంటే మూడు రోజుల పాటు శ్రమించాల్సి వస్తుంది.

మున్సిపాలిటీలో 100 కార్మికులు ఉంటే 30 మంది కార్మికులు డ్రైవర్లు గానూ ఆఫీస్ పనుల్లోనూ ఉంచుతున్నారు. పారిశుద్ధ్య కార్మికులను పెంచాల్సిన అవసరం ఉంది. దీనికి తోడు సరిపడా పని ముట్లు లేవు. ట్రాక్టర్‌లు, పుష్ కార్టులు పాడైపోయి మూలన పడి ఉంటాయి. దుర్గామల్లేశ్వరస్వామి ఆలయం ఎదుటి కల్వర్టు మూసుకుపోవడంతో మురుగు నీరంతా రోడ్డుపై ప్రవహిస్తోంది. తరచూ ఇక్కడ ఈ పరిస్థితి ఎదురవు తున్నా సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా మున్సిపాలిటీ అధికారులు చేపట్ట లేదు.

పట్టణంలో దాదాపు 150 కిలోమీటర్లకు పైగా సిమెంట్ కాలువలు, 120 కిలోమీటర్ల వరకు కచ్చా కాలువలు గతంలో నిర్మించారు. ఇప్పుడు ఉన్న జనాభా ప్రాతిపదికన ఇంకా కాలువలు నిర్మించాల్సిన అవసరం ఉంది. గతంలో అయ్యన్నపాత్రుడు మంత్రి గా ఉన్న సమయంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ తీసుకు రావాలని ప్రతిపాదనలు చేశారు. ఇప్పుడు అది అమలు చేస్తే బాగుంటుందని పట్టణ ప్రజలు తెలిపారు. ప్రస్తుతం అబీద్ కూడలి నుంచి పాల్ఘాట్ కూడలి వరకు మాత్రమే భూగర్భ డ్రైనేజీ పనులు పూర్తయ్యాయి. అస్తవ్య స్తంగా మారిన డ్రైనేజీ వ్యవస్థని చక్కదిద్దేందుకు మున్సిపల్ పాల పాలకవర్గం శ్రద్ధ చూపాలని పలు వురు కోరుతున్నారు.



దుర్గగుడి వద్ద ప్రవహిస్తున్న మురుగునీరు



కృష్ణాబజార్ డ్రెయినేజీలో నిలిచిన చెత్తా చెదారం

వర్షాలకు కృష్ణా బజార్ వద్ద కాలువల్లో పూడిక పేరుకు పోయింది. పట్టణం మొత్తం పూడికలు పెరిగి పోవడంతో నీటి ప్రవాహానికి ఇబ్బంది ఎదురవుతోంది.

పారిశుధ్య కార్మికులను నియమించాలి

పెరిగిన జనాభాకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికుల ను పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కార్మికులకు ఇవ్వాల్సిన నూనెలు, సబ్బులు చేయి తొడుగులు ఇవ్వడం లేదు. తక్కువ మంది కార్మికులను నియమించి అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. జనాభా కు తగిన కార్మికులను నియమించక పోవడంతో భారం పడుతుంది. ఇప్పటికైనా మున్సిపాలిటీ లో పారిశుద్ధ్యం మెరుగు పడాలంటే కార్మికులను పెంచాలి



అడిగర్ల రాజు
సిఐటియు జిల్లా కార్యదర్శి

డిసిసిబి మేనేజర్‌గా అప్పారావు



ప్రజాశక్తి -కోటవురట్ల:జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ మేనేజర్‌గా అప్పారావు బాధ్యతలు చేపట్టారు. ఆయన దేవరాపల్లి నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇంతవరకు ఇక్కడ పని చేసిన మేనేజర్ శ్రీనివాసరావు తీవ్ర అనారోగ్యం కారణంగా విశాఖలో చికిత్స పొందుతున్నారు. అయన సెలవు ఉండడంతో శనివారం విధులకు హాజరయ్యారు.

ఘనంగా జగన్నాథ స్వామి పండగ

ప్రజాశక్తి -చీడికాడ:మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో జగన్నాథ స్వామి పండగను ఘనంగా నిర్వహించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో భారీ ఊరేగింపు చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పండుగ సందర్భంగా గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది.